ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 26 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:27 (బుధవారం సాయంత్రం)
సహర్: 4:47 (గురువారం ఉదయం)


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


హాజరైన కార్పొరేటర్లు

రాబడి పెంపునకు కార్యాచరణ

- ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యం
- ముఖ్యమైన పనులను గుర్తించి అమలు చేయాలి
- ఆస్తి, ఇతర పన్నుల రీ అసెస్‌మెంట్
- ఎల్ఆర్ఎస్ ద్వారా అదనపు ఆదాయం
- అర్బన్‌కు ప్రత్యేకంగా ఇద్దరు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్లు
- ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.188.31 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

ఖమ్మం నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఖమ్మం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రాథమిక అవసరాలకు సంబంధించి అధిక ప్రాధాన్యం ఉన్న పనులను గుర్తించి వాటిని పాలక వర్గంలో చర్చించిన తర్వాత వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)లో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రూ.188.31 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లో డ్రైనేజీ ప్లాన్‌పై దృష్టి పెట్టాలని, ప్రాథమిక అవసరాలకు మొదటి ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను, ఇతర పన్నులు రీ అసెస్‌మెంట్ చేసి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుందని, వాటిని సైతం సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. టౌన్ ప్లానింగ్, అద్దెల ద్వారా వచ్చే ఆదాయం, పన్నుల వసూలు వంటి ఆదాయ మార్గాలు పెంచుకోవడంతో గతం కంటే 25 శాతం ఆదాయం పెరిగిందన్నారు. పూణె నగరం పర్యటనలో గ్రహించిన అంశాలను తీసుకుని అక్కడ జరుగుతున్న మంచి ప్రాక్టీసెస్ ఇక్కడ అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం అర్బన్‌కు ప్రత్యేకంగా ఇద్దరు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్లను ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దూరదృష్టితో మాస్టర్ ప్లాన్ ను తయారు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తీగల వంతెన నిర్మాణానికి సంబంధించి పనులు వేగవంతం చేయడంలో భాగంగా శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్సీల నిధులలో భాగంగా రూ.4 కోట్లు కేటాయించాలని మంత్రి ప్రతిపాదనను అందరం ఆమోదించామన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఖమ్మం పట్టణ రూపు రేఖలు మారిపోయాయన్నారు. నగరంలో వీధి దీపాలకు అంచనా మించి ఖర్చు కావడం జరిగిందని, దానికి కారణాలు ఎంటనేది సమీక్షించుకోవాలన్నారు. నగరంలో దోమల బెడద ఎక్కువయిందనీ, వాటి నియంత్రణకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలన్నారు.

మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలీన పంచాయతీల అభివృద్ధిపైన దృష్టిసారించాలని సూచించారన్నారు. మంత్రి ఆదేశాలతో విలీన పంచాయతీలకే వార్డు బడ్జెట్ అధికంగా కేటాయించామనీ, ఆ నిధులను ఖర్చు చేస్తామన్నారు. రోడ్లు లేని చోట రోడ్లు, డ్రెయినేజీలు లేని చోట డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు వచ్చే నెల మొదటి వారంలో మరోసారి కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామన్నారు.

స్వల్ప వాగ్వాదం..

బడ్జెట్ సమావేశం ప్రారంభ సమయంలో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఉదయం 11 గంటల సమయంలో సభ (మిగతా 8వ పేజీలో)

రూ.188.31 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 188 కోట్ల 31 లక్షలతో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ బడ్జెట్ ఆమోదం పొందినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రకటించారు. నగరపాలక సంస్థకు సంబంధించి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయ, ఖర్చు వివరాలు, 2024-2025 సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇంటి పన్ను ద్వారా రూ. 33. 92 కోట్లు, సర్ చార్జ్ స్టాంప్ డ్యూటీ ద్వారా రూ. 13 కోట్లు, ఇతర ఆదాయం ద్వారా రూ. 55.90 కోట్ల ఆదాయం సమకూరుతుందని బడ్జెట్ లో అంచనా వేశారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు, రుణాల చెల్లింపు, 10 శాతం గ్రీన్ బడ్జెట్ కలుపుకుని చార్జీ వ్యయం కింద రూ. 65.05 కోట్లు కేటాయించారు. ఇంజనీరింగ్ విభాగం నిర్వహణ ఖర్చు, సాధారణ పరిపాలన, టౌన్ ప్లానింగ్‌కు రూ. 14.12 కోట్లు, క్యాపిటల్ ఖర్చుకు రూ. 23.65 కోట్లు కేటాయించారు. ప్రణాళిక, ప్రణాళికేతర నిధులు, ఇతర గ్రాంట్స్ ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.78.72 కోట్ల క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించారు.

ఇవీ హైలైట్స్

- 60 వార్డుల్లో రీ అసెస్‌మెంట్ సర్వే
- ట్రేడ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక కార్యాచరణ
- ఐదు జోన్లుగా నగరంలోని 60 డివిజన్లు
- ప్రతీ జోన్‌లో రెవెన్యూ అధికారి
- ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఈ
- పారిశుధ్య నిర్వహణ కోసం 131 వాహనాలు
- పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లకు జీపీఎస్ వాకీటాకీలు
- వారం రోజుల్లో రోడ్డు స్వీపింగ్ యంత్రం రాక
- 19 నూతన ట్రాక్టర్లు, 30 ఆటోలు, 2 గడ్డి తొలగింపు, 2 డీసిల్టింగ్, 2 వ్యాక్యూమ్ యంత్రాల కొనుగోలు



ఇన్సులిన్ ఇంజక్షన్లు ఏవీ!?

- సెంట్రల్ డ్రగ్‌స్టోర్స్‌లో నిండుకున్న స్టాక్
- వెనుదిరుగుతున్న రోగులు
- ఇన్ పేషంట్లకు ఇబ్బంది

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షుగర్ బాధితులకు వినియోగించే ఇన్సులిన్ ఇంజక్షన్లు నిండుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 30 ఏళ్ల దాటిన వారికి రక్తపోటు, మధుమేహం సమస్యలున్నట్లు గుర్తించిన ప్రభుత్వం మందులు పంపిణీ చేయాలని యోచిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా మధుమేహం (షుగర్) వ్యాధి తీవ్రను నియంత్రించే ఇన్సులిన్ ఇంజక్షన్లను పంపిణీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అన్ని పీహెచ్‌సీలతో పాటు జిల్లా ప్రధాన జనరల్ ఆస్పత్రిలోనే వీటి కొరత ఏర్పడింది. గత 15రోజులుగా ఇన్సులిన్ ఇంజక్షన్లు లేకపోవడంతో అధిక షుగర్ వ్యాధిగ్రస్తులు, ఆస్పత్రిలో ఇన్‌వార్డుల్లో ఉన్న రోగులు, ఆపరేషన్‌కు సిద్ధంచేసిన వారికి, ఆపరేషన్ థియేటర్ల లోనూ ఇబ్బందులు పడుతున్నారు.

నిండుకున్న నిల్వ

జిల్లా కేంద్రంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 5 రకాల ఇన్సులిన్ ఇంజక్షన్లు సరఫరా అవుతుంటాయి. ఒక్కో పీహెచ్‌సీలో వీటిని కనీసం 200 వరకు నిల్వ ఉంచుతారు. జిల్లా ఆస్పత్రిలో కనీసం 500 నుంచి 1000 వరకు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచుతారు. కానీ గత పది రోజులుగా గ్లార్జిన్ అనే రకం ఇంజక్షన్ 200 వరకు మాత్రమే ఉన్నాయి. మిగిలిన కంపెనీలకు చెందిన (మిగతా 6వ పేజీలో)

ఎన్సీడీ ద్వారా గుర్తింపు

జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షల్లో 10శాతం మంది బీపీ, 7.1 శాతం మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలున్నాయి, దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రితో పాటు 26 పీహెచ్‌సీలు, 4 యూపీహెచ్‌సీల్లో ఎన్సీడీ క్లినిక్‌లను ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రితో పాటు మధిర, సత్తుపల్లి, పెనుబల్లి, నేలకొండపల్లి, ఏరియా ఆస్పత్రుల్లో క్లీనిక్‌లను ఏర్పాటు చేసి ఈ కేంద్రాలకు వచ్చే రోగులకు మందులను అందిస్తున్నారు. అంతే కాదు షుగర్ అధికం అయితే వారికి ఇన్సులిన్‌ను కూడా అందించాల్సి ఉంటుంది. ఆస్పత్రిలో చేరి ఇన్‌పేషంట్లుగా ఉండే షుగర్ బాధితులకు ఇన్సులిన్‌ను వినియోగిస్తారు. దీని ద్వారా అతని షుగర్ స్థాయిని తగ్గించడంతో పాటు ఆపరేషన్లకు సిద్ధం చేస్తుంటారు.

రేపు బార్ అసోసియేషన్

ఎన్నికలు

- పోటాపోటీగా తలపడుతున్న అభ్యర్థులు

ఖమ్మం లీగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. బుధవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తాజా ఎన్నికలకు మొత్తం ఓటర్లు 816మంది ఓటర్లు నమోదయ్యారు. విజయం కోసం అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తుండటంతో గెలుపోటములపై ఉత్కంఠ ఏర్పడింది. ఎలాగైనా విజయం సాధించాలనే లక్ష్యంతో కొందరు అభ్యర్థులు ఫంక్షన్‌హాల్స్ బుక్‌చేసుకొని పార్టీలు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా ఖర్చు పెడుతున్నారు. కొందరు అభ్యర్థులు వివిధ సామాజిక వర్గాలను సమీకరించుకుంటున్నారు. వాట్సాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఏప్రిల్ మూడో వారంలో న్యాయవాద సొసైటీ ఎన్నికలు ఉండటంతో (మిగతా 6వ పేజీలో)

నమ్మించి మోసం చేశారు..

- క్యాష్‌బ్యాక్ ఆఫర్‌తో ఆన్‌లైన్‌లో ఎర
- రూ.30వేలు నష్టపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

తల్లాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కూర్చొని డబ్బులు సంపాదించవచ్చుననే ప్రచారాన్ని నమ్మి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మోసపోయాడు. ఈ సంఘటన తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈజీ మనీ ఎలా సంపాదించవచ్చో చెబుతూ టెలిగ్రామ్‌లో కాయిన్ గూగుల్ మ్యాప్స్ అనే యాప్ ద్వారా దుండగులు వల వేశారు. దీని ద్వారా తమను సంప్రదించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చాటింగ్ ద్వారా సందేశం పంపారు. దీనిలో చేరాలంటే విడతలవారీగా డబ్బు చెల్లించాలని, మొదటిగా రూ.5వేలు, రెండో విడతలో రూ.65వేల వరకు చెల్లిస్తే 30నుంచి 60శాతం వరకు అదనంగా కలిపి క్యాష్ బ్యాక్ వస్తాయని నమ్మించారు. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి బ్యాంకు అకౌంట్, పాన్, ఆధార్‌కార్డులు తదితర వివరాలు తీసుకొని ఎమౌంట్ పే చేయమని కోరారు. వారి మాటలను నమ్మిన సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.5వేలు ముందుగా డిపాజిట్ చేయగా, (మిగతా 6వ పేజీలో)

భక్తుల కోసం 'భద్ర'గిరి

- శ్రీరామనవమికి సిద్ధమవుతున్న వైద్యశాఖ
- 11 ప్రథమ చికిత్స కేంద్రాలు
- అత్యవసర వైద్య సేవల కోసం 65 బెడ్లు
- అన్ని గ్రూపుల రక్తం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు
- 40 మంది వైద్యులు, 116 మంది వైద్య సిబ్బంది
- 45 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఏప్రిల్ 5, 6, 7వ తేదీల్లో అందుబాటులో వైద్య సేవలు


భద్రాచలంలో ప్రథమ చికిత్స కేంద్రం (ఫైల్)

భద్రాచలం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మార్చిలోనే ఎండలు తారస్థాయిలో ఉన్నాయి. ఇక ఏప్రిల్ మొదటి వారంలో ఎండల తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఏప్రిల్ ఆరున శ్రీ సీతారాముల కల్యాణం తిలకించడానికి భద్రాద్రికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి వైద్య ఆరోగ్యపరమైనసమస్యలొచ్చినా వెంటనే వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5,6,7 తేదీల్లో వైద్య ఆరోగ్యశాఖ భద్రాచలం, పర్ణశాల, సారపాకల్లో వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

గతంలో భద్రాచలంలో ఎనిమిది, పర్ణశాలలో రెండు ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయగా తొలిసారిగా సారపాకలో సైతం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమయంలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ఫిజీషియన్, కార్డియాలజిస్టు, జనరల్ సర్జన్‌తో పాటు నిపుణులైన వైద్యులను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచుతున్నారు. ఈసారి శ్రీరామనవమికి సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీరామ మహాపట్టాభిషేకంకు గవర్నరు జిష్ణుదేవ్ వర్మ రానుండటంతో ఇందుకోసం వైద్యశాఖ మరింత పకడ్బందీగా అత్యవసర మందులు, వైద్యులు, ప్రత్యేక బెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు అంబులెన్సులతో పాటు ఒక లైఫ్ సపోర్టు అంబులెన్సును సైతం అత్యవసర సేవల కోసం భద్రాద్రిలో అందుబాటులో ఉంచనున్నారు. అలాగే పర్ణశాలలో సైతం రెండు అంబులెన్సులను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచనున్నారు.

అత్యవసర వైద్య సేవల కోసం 65 బెడ్లు

ఎండల తీవ్రత తారస్థాయిలో ఉండటంతో ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వైద్యశాఖ ముందస్తుగా అత్యవసర వైద్య సేవల కోసం 65 బెడ్లను ఏర్పాటు చేస్తోంది. భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో 50 బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలోని మూడు ప్రైవేటు వైద్యశాలల్లో ఐదేసి బెడ్ల చొప్పున అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే సంబంధిత వైద్యశాలల నిర్వాహకులను ఆదేశించారు.

ఇదిలా ఉండగా అత్యవసర సమయాల్లో భక్తులకు సీపీఆర్ సేవలందించేందుకు సీపీఆర్ శిక్షణ ఇప్పటికే కొంత మందికి ఇవ్వగా తాజాగా విధుల్లో ఉండే ప్రతి ఒక్కరు సీపీఆర్ చేసేలా శిక్షణ ఇవ్వనున్నట్లు వైద్యశాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మిథిల స్టేడియం సమీపంలో ఇద్దరు వైద్యులు, పది మంది వైద్య సిబ్బందితో కూడిన బృందాలు అందుబాటులో ఉంటుంది. ఇందులో ఒక బృందం అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు కావలసిన వారికి సీపీఆర్ చేసి వైద్య సేవలు అందించేందుకు నిర్దేశించిన వైద్యశాలలకు తరలిస్తారు. కాగా మరో బృందం అక్కడే ఉండి వైద్య సేవలను అందించేందుకు సిద్ధంగా ఉంటుంది. భక్తులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కించేందుకు అన్ని బ్లడ్ గ్రూపులకు చెందిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకులో ముందస్తుగా నిల్వ చేసేందుకు (మిగతా 6వ పేజీలో)

పర్ణశాలకు ట్రిప్పులు పెంచాలి: ఆర్టీసీ ఈడీ 6


భద్రాద్రి నూతన ఆలయ నమూనా

టెంపుల్ సిటీగా భద్రాద్రి

- రూ.34 కోట్లు విడుదల చేయడంపై మంత్రి తుమ్మల హర్షం
- సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి / భద్రాచలం మార్చి 25: భద్రాద్రిని టెంపుల్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేయడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరి చేయాలని గతంలో మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు రూ. 34 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భద్రాద్రి రాముని కళ్యాణ ఆహ్వాన పత్రిక అందించిన నేపథ్యంలో భద్రాద్రి ఆలయానికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను కూడా సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల వివరించారు. భూసేకరణ పనులు జరిపితే ఆలయ అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం ఉండదని, భద్రాద్రి దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చెందనుందని సీఎంకు వివరించారు. దానికి స్పందించిన ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులకు సుముఖత వ్యక్తం చేయడంతో పాటు భూసేకరణకు వెంటనే నిధులు మంజూరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఆగమ పండితులు రూపొందించిన నమూనాలు, సూచనల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి తుమ్మల భద్రాచలం ఆలయ అధికారులకు తుమ్మల సూచించారు. భూసేకరణ పనులు కూడా వేగవంతం చేయాలని ఇళ్ల దుకాణాలు తొలగించాలని అధికారులకు సూచించారు.


సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల



ట్రాలీ ఆటో అదుపుతప్పి వాగులో బోల్తా

- 25 మంది కూలీలకు గాయాలు
- బేతాళపాడు వద్ద ఘటన
- కొత్తగూడెం ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు

6

గాంధీచౌక్ గేట్ నుంచి రాకపోకలు షురూ

- తొలగిన ప్రజల ఇబ్బందులు

ఎంపీ వద్దిరాజు కృషి

ఖమ్మం మామిళ్లగూడెం/ ఖమ్మం చర్చి కాంపౌండ్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గత మూడు నెలలుగా మూసివేసిన నగరంలోని గాంధీచౌక్ (మధ్య) రైల్వే గేట్ తెరుచుకుంది. మంగళవారం నుంచి రాకపోకలను ప్రారంభించారు. మూడోలైన్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ గేట్‌ను మూసేశారు. అయితే పనులు పూర్తి కావడంతో గేట్ నుంచి రాకపోకలు ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి కూడా గేట్‌ను పరిశీలించారు. ఆ తర్వాత మంగళవారం ఉదయం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చొరవతో ఖమ్మం నగరంలోని మధ్య రైల్వేగేటు తెరుచుకుందని ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.. గేటు మూసివేతతో తాము పడుతున్న ఇబ్బందులను ప్రజలు, వ్యాపారులు ఎంపీ వద్దిరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించడమే కాకుండా రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లారు. మధ్యగేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం అవసరంపై వినతిపత్రం ద్వారా వివరించారు. దీంతో స్పందించిన రైల్వేశాఖ మంత్రి గేటు తెరిపించి రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారని ప్రకటనలో తెలిపారు.



ఫేస్ టు ఫేస్



ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సత్ఫలితాలు

వంగా రవీంద్ర రెడ్డి, డీఎస్పీ, మణుగూరు


ప్రశ్న: మణుగూరు డివిజన్‌లో నక్సల్స్ కదలికలు ఉన్నాయా ?
జ: ఏ మాత్రం లేవు. గతంలో ఎప్పుడో కొంత అలజడి ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం లేదు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వల్ల స్వచ్ఛందంగా లొంగిపోతున్నారు. జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు.
ప్ర: నక్సల్ ప్రభావిత గ్రామాలపై ఎలా పట్టు సాధించారు?
జ: వలస ఆదివాసీ గ్రామాల్లో జనాభా సమాచారం అంతా మా వద్ద ఉంది. కొత్తవారి అలికిడి ఉంటే విచారణ చేస్తున్నాం. కార్డెన్ సెర్చ్ ద్వారా గ్రామాల ప్రజల వివరాలు తెలుస్తుంది. మౌళిక సదుపాయాలైన తాగునీరు, సోలార్ విద్యుత్, రోడ్లు, మెడికల్ క్యాంపులు, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ మంచి ఫలితాలను ఇస్తున్నాయి.
ప్ర: గంజాయిపై తీసుకుంటున్న చర్యలు ఏంటి?
జ: డివిజన్‌లో గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఉంది. నిరంతరం సమాచార సేకరణ చేస్తూ దాన్ని నియంత్రించేందుకు చర్యలను చేపడుతున్నాం.
ప్ర: ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా పరిస్థితి ఏమిటి?
జ: అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం తరలింపుపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇటీవల 180 క్వింటాల బియ్యాన్ని పట్టుకుని కేసులు పెట్టాం.
ప్ర: ట్రాఫిక్ నియంత్రణ ఎలా ఉంది?
జ: మణుగూరు పట్టణ ప్రాంతంలోని ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాము. ప్రత్యేకించి ఉదయం సాయంత్ర వేళల్లో మాత్రం వాహనాల రాకపోకలతో రద్దీ ఉంటుంది. ఈ సమయంలో సిబ్బంది ఆయా పాయింట్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.
ప్ర: సీసీ కెమెరాల వ్యవస్థ ఎలా ఉంది?
జ: మణుగూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో దాదాపు 90 కెమెరాల నిఘా వ్యవస్థ ఉంది. ఎక్కడ ఏం జరిగినా ఇట్టే సీసీ ఫుటేజీల ఆధారంగా వాటిని గ్రహిస్తున్నాం. ఇటీవల జరిగిన హత్య కేసు కూడా సీసీ క్యామ్‌ల ద్వారా ఛేదించాం. శాంతి భద్రతల పరిరక్షణలో కొంత మేర ఇవి సహకరిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగితే సీసీ కెమెరాల వల్ల వాహనాల నెంబర్లు ద్వారా యజమాని సమాచారం క్షణాల్లో సేకరించేందుకు వీలవుతోంది.
ప్ర: మణుగూరు బైపాస్ రోడ్డు సదుపాయాలపై చర్యలు తీసుకుంటున్నారా ?
జ: మణుగూరు పట్టణంలోని ప్రధాన రోడ్డు గుండా లారీల రాకపోకల నియంత్రణ కోసం మణుగూరు బైపాస్ రోడ్ ఏర్పాటు అంశంపై పరిశీలనలు చేస్తున్నాం. సింగరేణి, బీటీపీఎస్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలను చేపడతాం.

- ఆంధ్రజ్యోతి, మణుగూరు టౌన్

బాలల కోసం సాహిత్యం సృష్టించటం, వారితో సాహిత్యం రాయించటం కత్తిమీద సాములాంటిదే. మన సంస్కృతిని, సంప్రదాయాలను పిల్లలకు తెలియచెప్పేందుకు సాహిత్యం ఒక చక్కని వేదిక. పిల్లల్లో సాహిత్యపు విత్తులు నాటితే అవి మొలకెత్తి విజ్ఞానపు భాండాగారాన్ని తయారు చేస్తాయనుటలో అతిశయోక్తిలేదు. సరిగ్గా ఇదే ఒరవడిలో అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లోని విద్యార్థులు చిట్టి చిట్టి రచనలతో కూడిన సృజనకిరణం పేరుతో పుస్తకాలు ముద్రించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కాంప్లెక్స్‌లో ప్రత్యేక ఒరవడిని సృష్టించారు.



సృజన కిరణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్



చిట్టి చేతుల.. చక్కని రాతలు..

- విద్యార్థుల రచనలతో 'సృజన కిరణాలు'
- బాల సాహిత్యానికి చేయూతనిస్తున్న ఉపాధ్యాయులు
- రాతలు, బొమ్మలతో ప్రత్యేక సంచికలు
- అశ్వారావుపేట కాంప్లెక్స్‌లో ప్రత్యేక ఒరవడి
- రాష్ట్రంలోనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన టీచర్లు

అశ్వారావుపేట రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట కాంప్లెక్స్ హెచ్ఎం పరుచూరి హరిత అందించిన స్ఫూర్తితో ప్రముఖ కవి, రచయిత, సీఆర్‌పీ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు సంపాదకత్వంలో విద్యార్థులను ప్రోత్సహించారు. చిన్నారులు రాసిన కవితలు, జోక్స్, కథలు వంటి వాటితో సృజనకిరణం పేరుతో సముదాయ సంచికలను ముద్రిస్తున్నారు. ఇప్పటికే మూడు సంచికలను ముద్రించగా తాజాగా సృజనకిరణం-4 పేరుతో మరో సంచికను వెలువరించారు. ఇందులో విద్యార్థులు గీసిన బొమ్మలు కూడా చోటు చేసుకున్నాయి.

ప్రకృతి ప్రాధాన్యం వివరిస్తూ...

ప్రకృతిని రక్షించుకోకపోతే కాలుష్యం పెరిగి అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ అశ్వారావుపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆరేపల్లి వీక్షిత అద్భుతమైన కవితను రాయగా పుస్తకంలో ముద్రించారు. అందరూ ఆనందంగా కలిసి ఉండే కలిగే లాభాలను కవిత రూపంలో బీసీ కాలనీ పాఠశాలకు





విద్యార్థినులు గీసిన చిత్రాలు

చెందిన 5వ తరగతి విద్యార్థిని హిమశ్రీ బిందు రాయగా సంచికలో చోటు కల్పించారు.

విద్యార్థులకు ఎనలేని ఆనందం

సాధారణంగా విద్యార్థులు రాసిన కవితలైనా, గీసిన బొమ్మలు అయినా ఇంట్లో దాచుకుంటారు. కాని ఇక్కడ చిన్నారులు గీసిన బొమ్మలు, రాసిన కవితలు సృజన కిరణాలుగా సంచికల రూపంలో ముద్రించటంతో విద్యార్థుల్లో ఎనలేని ఆనందం కలుగుతుంది. తాను గీసిన బొమ్మను, రాసిన కవితను చూసుకుంటూ విద్యార్థులు పొందే మాటల్లో చెప్పలేకుండా ఉంటుంది. గతకొంతకాలంగా విద్యార్థుల కవితలతో వెలువడుతున్న సృజన కిరణాలు ద్వారా కవితలు రాసేందుకు, బొమ్మలు గీసేందుకు విద్యార్థులు పోటీలు పడుతున్నారు. కాంప్లెక్స్ ఉపాధ్యాయులు చేపట్టిన బృహత్తరమైన ఈకార్యక్రమం అందరిలోనూ తమ ప్రతిభను బయటకు తీసేందుకు ఎంతగానో తోడ్పతుందనటంలో సందేహమే లేదు.

పిల్లల్లో మానసిక ఎదుగుదలకు దోహదం
పరుచూరి హరిత, కాంప్లెక్స్ హెచ్ఎం



బాలల హృదయాలలో సృజనాత్మకత సహజంగానే ఉంటుంది. సృజనను వెలికి తీసే ప్రయత్నాలు కొనసాగితే అద్భుత కళాఖండాలను సృష్టించటమే కాకుండా పిల్లల్లో మానసిక ఎదుగుదల ఏర్పడుతుంది. విద్యార్థుల సృజనను ప్రోత్సాహించాలనే ఆశయంతోనే సృజనకిరణంను ప్రచురిస్తున్నాం.

సృజనకు అక్షర నైపుణ్యం ఈసంచిక
డా. సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు, సీఆర్‌పీ



అశ్వారావుపేట కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు తమ చిట్టి కలాలకు, కుంచెలకు పనిచెప్పి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. చక్కని రచనా కౌశలాన్ని వంట పట్టించుకుంటున్నారు. ఉపాధ్యాయులు వాటికి అక్షర నైపుణ్యాన్ని అద్ది వారిని ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల సృజనను పలువురికి పంచేందుకే సృజన కిరణంను ముద్రిస్తున్నాం.

చిన్నారులు రాసిన కవితలు



ఆరేపల్లి వీక్షిత

మనకు ఊపిరి ప్రకృతి
ప్రకృతిని కాపాడటం మన ధర్మం
ప్లాస్టిక్‌ను వాడడం మానేసి
భూమాతను రక్షిద్దాం
స్వార్థాన్ని వదిలిపెట్టి
కాలుష్యాన్ని తరమికొడదాం

అచ్చులతో అందాలు
అమ్మమాటే అమృతము
ఆకాశమే అద్భుతము
ఇల్లే నందనవనము
ఈ జీవితమే అపురూపము
ఉత్సాహంగా ఉండాలి



హిమశ్రీ బిందు

నేడు ఉర్సు మహోత్సవం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని శుక్రవారిపేటలో అతి పురాతనమైన హజరత్ సయ్యద్ పీర్ గైబ్‌సావలి దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు దర్గా సేవకుడు తాజ్ బాబా తెలిపారు. ఏటా రంజాన్ మాసంలో 25వ రోజు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరవీహ్ నమాజ్ అనంతరం తుమ్మలగడ్డలోని దర్గా సేవకులు తాజ్‌బాబా ఇంటి వద్ద నుంచి ప్రత్యేక ప్రార్థనలతో ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌గా అమరనేని

కొత్తగూడెం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్‌గా అమరనేని రామారావు, కన్వీనర్‌గా సంఘం వెంకటపుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి కొత్తగూడెం పెన్షనర్ల భవన్‌లో ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాలకు చెందిన జిల్లా బాధ్యుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఎన్నిక ప్రక్రియను చేపట్టారు.

మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో మనోళ్ల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోవాలో ఈనెల 16 నుంచి 23 వరకు జరిగిన 75వ మాస్టర్స్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. రిటైర్డ్ డీఎస్పీ కె. నర్సయ్య, పల్లెం రాజలింగు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి 75 సంవత్సరాలపైన ఏజ్ గ్రూప్‌లో కాంస్య పతకాలు సాధించారు. త్వరలో థాయ్‌లాండ్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

సికిల్‌సెల్ అనీమియా జన్యుపరమైన రక్త రుగ్మత

ఖమ్మం కలెక్టరేట్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ అనీమియా అనేది వారసత్వంగా వచ్చే జన్యుపరమైన రక్త రుగ్మత అని, అసాధారణ ఎర్ర రక్త కణాలు, రక్తహీనతకు దారి తీసే జన్యుపరమైన మార్పుల వల్ల వస్తుందని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతిబాయి, రాష్ట్ర సాంకేతిక నిఘా అధికారి కె. రమేష్ అన్నారు. మంగళవారం సికిల్‌సెల్ అనీమియాపై వైద్యులు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఇప్పటివరకు 87,448 మంది గిరిజనులకు స్క్రీనింగ్ నిర్వహించగా వ్యాధి తీవ్రత ఉన్నవారు ఐదుగురు, క్యారియర్లు 274 మందిని గుర్తించినట్లు వక్తలు తెలిపారు. నోడల్ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, డాక్టర్ .చందునాయక్, డాక్టర్ రామరావు సికిల్ సెల్ గురించి వివరించారు.

భక్తుల కోసం 'భద్ర'గిరి

(5వ పేజీ తరువాయి)

చర్యలు చేపట్టారు.

40 మంది వైద్యులు, 116 మంది సిబ్బంది

ఈసారి నవమి, శ్రీరామమహా పట్టాభిషేకానికి 40 మంది వైద్యులు, 116 మంది సిబ్బంది సేవలందించనున్నారు. మూడు షిఫ్ట్‌లలో వైద్యులు, సిబ్బంది భక్తులకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటారు. ఇదే సమయంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న పదివేల ఓఆర్ఎస్ ప్యాకెట్లకు అదనంగా మరో 35 వేల ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. ఈసారి తొలిసారిగా తలంబ్రాలు పంపిణీ, ప్రసాదాలు విక్రయించే కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంటున్నాయి. ఐవీ ఫ్లూయిడ్స్ ప్రతి ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ఒక బెడ్ అందుబాటులో ఉంచనున్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా పర్ణశాలలో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా ఇరువురు వైద్యులు అందుబాటులో ఉండనున్నారు.

మూడు రోజులు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి
డాక్టర్ ఆర్‌పీ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో, భద్రాచలం



ఈసారి శ్రీరామనవమి, మహాపట్టాభిషేకాలకు తరలివచ్చే భక్తుల కోసం వైద్యశాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఏప్రిల్ 5,6,7వ తేదీల్లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తమకు కేటాయించిన చోట విధులు నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో అందుకు అనుగుణంగా కావాల్సిన అత్యవసర మందులు, వైద్య సదుపాయాలు పెంచాం.

ఇళ్ల యజమానులతో ఆర్డీవో సమావేశం

భద్రాచలం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం రామాలయ అభివృద్ధి పనులు చేపట్టనున్న క్రమంలో 45 ఇళ్లను తొలగించనుండటంతో సంబంధిత ఇంటి యజమానులతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వంభూ సేకరణ పనుల ప్రక్రియలో భాగంగా ఇంటి యజమానులకు చెల్లించేందుకు రూ.34 కోట్ల నిధులను సోమవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన మొత్తం సీపీవో ఖాతాకు బదిలీ అయ్యాయి. ఈ క్రమంలో ఇంటి యజమానులను వారి వద్ద ఉన్న ధృవీకరణ పత్రాలను, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వివరాలను తీసుకురాల్సిందిగా రెవిన్యూ అధికారులు సూచించారు. ఈ క్రమంలో వారితో ఆర్డీవో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వారి నుంచి ధృవీకరణ పత్రాలు స్వీకరించడం జరిగిందని, ధృవీకరణ పత్రాల పరిశీలన పూర్తయ్యాక నగదు చెల్లింపులు చేస్తామని ఆర్డీవో వెల్లడించారు.

రేపు బార్ అసోసియేషన్ ఎన్నికలు

(5వ పేజీ తరువాయి)

కొందరు అభ్యర్థులు వాటితో ముడిపెట్టి ప్రచారం నిర్వహిస్తున్నారు. అధ్యక్ష పదవికి గుట్ట వెంకటగుప్తా, తొండపు వెంకటేశ్వరరావు, అయ్యదేవర విజయరాఘవ, ఉపాధ్యక్ష పదవికి ఎస్‌కే.జానీమియా, మల్లెం రవిప్రసాద్, మోతుకూరి విజయశాంతి, ప్రధాన కార్యదర్శి పదవికి గద్దల దిలీప్‌కుమార్, తెల్లాకుల రమేష్‌బాబు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి దేవరకొండ కళ్యాణి, సింగరాపు రాంబాబు, క్రీడల కార్యదర్శి పదవికి కేవీవీ లక్ష్మి, ధరావత్ రాందాస్‌నాయక్ పోటీ పడుతున్నారు. మూడు పదవులు ఇప్పటికే ఏకగ్రీవం అయినట్లుగా ఎన్నికల అధికారి సర్వదేవభట్ల సోమశేఖరశర్మ తెలిపారు.

కాగా, ఎన్నికలరోజున ఓటర్లు తమ ఐడీకార్డును తప్పనిసరిగా తీసుకురావాలని ఎన్నికల అధికారి కోరారు. ఎన్నికల నియమావళి అమలుకు అభ్యర్థులు అందరూ సహకరించాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ వెంటనే కౌంటింగ్ పూర్తిచేసి ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ఠ ఏర్పాట్లు

- సన్న, దొడ్డు రకం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలు
- అన్నిచోట్లా మౌలిక వసతులుండాలి
- సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు పక్కాగా ధ్రువీకరించాలి
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): యాసంగిలో ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ఠ కార్యాచరణ రూపొందించాలని... సన్న దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల జిల్లాలో విజయవంతంగా ముగిసిందన్నారు. రైతులు పండించిన వరి పంట విస్తీర్ణం, పంట కోతల సమయం, కొనుగోలు కేంద్రాలకు ఎప్పుడు పంటలు తీసుకుని వస్తారనే అంశం వ్యవసాయశాఖ ప్రణాళికాబద్ధంగా షెడ్యూల్ చేయాలన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్, గన్ని సంచులు మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాల సూచించారు. రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారులు సర్టిఫై చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలోనే తేమ యంత్రాలు అందుబాటులో పెట్టి, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేసేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు నూతన సిమ్ కార్డులను అందించి డేటా ఎంట్రీ సత్వరం జరిగేలా చూడాలని అన్నారు. రైతులకు 48 గంటల వ్యవధిలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని అన్నారు.

మిల్లుల్లోనూ జాప్యం జరగొద్దు

రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాలు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు ఒకేసారి జరుగుతున్న నేపథ్యంలో రవాణా వాహనాలకు ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా పటిష్ఠ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాలలో ఇతర రాష్ట్రాల నుంచి సన్నరకం ధాన్యం రాకుండా చూడాలని అన్నారు. అనంతరం కనీస మద్దతు ధరలు తెలిపే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఇన్సులిన్ ఇంజక్షన్లు ఏవీ!?

(5వ పేజీ తరువాయి)

ఇంజక్షన్లు సరఫరా కావడం లేదు. పది రోజులుగా రోగులకు వీటిని వేయడానికి స్టాకు లేకపోవడంతో వైద్యులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రోగులు ఆస్పత్రికి వచ్చి వెనుతిరిగి వెళ్తున్నారు. అంతే కాదు ఇన్‌పేషంట్లకు ఇంజక్షన్లు లేవని బయటి నుంచి తెప్పించుకోవాలని రాస్తున్నట్లు వాపోతున్నారు. సర్కారు సర్వేలు చేసి రోగులను గుర్తించడం మాట ఎలా ఉన్నా ఉన్న రోగులకు మందులను పంపిణీ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపిస్తున్నారు.

నిల్వ లేని మాట వాస్తవమే...

పద్మ, సెంట్రల్ డ్రగ్‌స్టోర్స్ ఇన్‌చార్జ్

జిల్లాలో ఇన్సులిన్ ఇంజక్షన్ల కొరత ఉన్న మాట వాస్తవమే అన్నారు. పాత మందులు గడువు మీరడంతో వాటిని ఆయా కంపెనీలకు అప్పగించాం. ప్రతి నెలా 5 రకాల ఇన్సులిన్ ఇంజక్షన్లు వస్తుంటాయి. ఒక్కో పీహెచ్‌సీలో కనీసం 200వరకు స్టాకు ఉంటుంది. కానీ గత పది రోజులుగా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనూ ఇంజక్షన్లు అయిపోయాయి. నివేదికలను పంపిస్తున్నాం. పది రోజుల్లో స్టాకు వస్తుందని చెబుతున్నారు.

జిల్లా గణాంకాలు ఇలా :

30 వయస్సు పైబడిన జనాభా	: 7,30,852
బీపీ బాధితులు	: 73,327
షుగర్ బాధితులు	: 51,851

నమ్మించి మోసం చేశారు..

(5వ పేజీ తరువాయి)

అదనంగా రూ.6200 వచ్చినట్లు చూపించారు. తిరిగి రెండోసారి రూ.25 వేలు డిపాజిట్ చేయవల్సిందిగా కోరడంతో పాటు రూ.30,300 వస్తాయని ఆశ చూపడంతో డిపాజిట్ చేశాడు. అనంతరం అమౌంట్ డిపాజిట్ కాకపోవడంతో ఏమిటని అడిగితే, మీరు ఈసారి రూ.50వేలు డిపాజిట్ చేయాలని దుండగులు కోరారు. అనుమానం వచ్చి అడిగితే నెంబర్ బ్లాక్ చేశారని తన వద్ద నుంచి రూ.30,300 నగదు కట్ అయ్యాయని తెలిపాడు. మోసపోయానని తెలుసుకున్న సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ క్రైమ్ ద్వారా ఫిర్యాదు చేశాడు.

నెరవేరనున్న కల్లూరు మునిసిపాలిటీ కల

కల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) అసెంబ్లీలో బిల్లు అమోదంతో కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీ మునిసిపాలిటీగా రూపుదిద్దుకోనున్నది. కల్లూరు పట్టణానికి మునిసిపాలిటీగా మారేందుకు అన్న అర్హతలు ఉండటంతో స్థానికంగా పలు రాజకీయపార్టీల, ప్రజల, విజ్ఞాపనను దృష్టిలో ఉంచుకొని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కూడ మునిసిపాలిటీ విషయంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గత డిసెంబరు నెలలో కల్లూరులో ఇందిరమ్మ మోడల్ గృహాన్ని శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన సభలో తగిన హామీ ఇచ్చారు. ఆ ప్రకారం కల్లూరు మేజర్ గ్రామ పంచాయితీలో మరో ఏడు గ్రామ పంచాయితీలను విలీనం చేస్తూ గ్రామ సభలో తీర్మానాలను అమోదించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీంతో కల్లూరు పట్టణాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు కల్లూరు మేజర్ పంచాయితీని ఉన్నతిగా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో సోమవారం మంత్రి వర్గ అమోదంతో ఎట్టకేలకు అసెంబ్లీలో బిల్లును పురపాలకశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారింగా ప్రకటించారు.

ఎనిమిది గ్రామాలతో మునిసిపాలిటీ

కల్లూరు మేజర్ పంచాయితీతో పాటుగా మండల పరిధిలో గల కప్పలబంధం, కిష్టయ్యబంజరు, హనుమాతండ, తూర్పులోకవరం, పడమర లోకవరం, పుల్లయ్యబంజరు, వాచ్యానాయక్‌తండ గ్రామా పంచాయితీలు కూడ గతంలో కల్లూరు మునిసిపాలిటీ ఉన్నతిగా రూపుదిద్దుకునేందుకు విలీనం చేస్తూ గ్రామ సభలలో తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడ పంపాయి.

ట్రాలీ ఆటో అదుపుతప్పి.. పెద్దవాగులో బోల్తా

జూలూరుపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ట్రాలీ ఆటో వంతెన పైనుంచి అదుపుతప్పి వాగులో పడింది. ఈ సంఘటనలో 25మంది కూలీలకు గాయాలయ్యాయి. జూలూరుపాడు మండలంలోని బేతాళపాడు గ్రామం వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. మండలంలోని చీపురుగూడెం, టాక్యాతండా, బాడవపోలు, ఎలకలొడ్డు గ్రామాలకు చెందిన సుమారు 30 మంది కూలీలు మొక్కజొన్న కంకులు విరిచేందుకు ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలంలోని రాజులపాలెం గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో పెద్దవాగు వంతెనపై నుంచి వాగులో ట్రాలీ ఆటో పడిపోయింది. ఈ ప్రమాదంలో చీపురుగూడెం గ్రామానికి చెందిన సోడె రాజశేఖర్, వజ్జ సత్యం, వజ్జ పగడయ్య, బొర్రా రాఘవులు, వసంత్, ఎలకలొడ్డుకు చెందిన కొండెం వెంకటేశ్వర్లు, టాక్యాతండాకు చెందిన బాణోత్ సురేష్, బాణోత్ బిక్కులకు తీవ్ర గాయాలయ్యాయి. బాడవపోలు, చీపురుగూడెం, ఎలకలొడ్డు, టాక్యాతండా గ్రామాలకు చెందిన మరో 17 మంది కూలీలు స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన కూలీలను 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొంత మంది కూలీలను ప్రైవేటు వాహనాలలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. గాయపడిన వారిలో రాజశేఖర్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. పరిమితికి మించి ట్రాలీ ఆటోలో కూలీలను తరలిస్తుండటంతో అదుపుతప్పి వాగులో పడిందని పలువురు అంటున్నారు. ఎస్ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పర్ణశాలకు ట్రిప్పులు పెంచాలి

- భక్తులు గమ్యస్థానాలకు చేరేవరకు రవాణా సదుపాయం
- ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



భద్రాచలం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శ్రీరామనవమిని వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులను తిరిగి ఇంటికి చేర్చే విధంగా రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుష్రో షా ఖాన్ అన్నారు. భద్రాచలంలో మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఖమ్మం ఆర్ఎం సరిరాం, డిప్యూటీ ఆర్ఎం మల్లయ్యలతో పాటు ఆర్టీసీ డిపో మేనేజర్లు, అధికారులతో ఆయన శ్రీరామనవమి సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికులకు అందించే సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులు మెచ్చే రీతిలో ఆర్టీసీ ఉద్యోగులు పని చేసి మంచి పేరు సంపాదించాలన్నారు. ఆర్ఎం సరిరాం మాట్లాడుతూ భద్రాచలం నుంచి పర్ణశాల వరకు అధిక సంఖ్యలో బస్సులు నడపాలని, తెలంగాణ ప్రాంతంలోని అన్ని రూట్లలో ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఖమ్మం రీజినల్ పరిధిలోని డిపో మేనేజర్లందరికి సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రాంతంలోని వివిధ డిపోల మేనేజర్లు కూడా పాల్గొన్నారు.

జాలిముడితో మడులు తడిసేనా..?


» పుష్కరకాలంగా పురోగతి లేని ప్రాజెక్ట్
» ప్రతిపాదిత ఆయకట్టు నాలుగు వేల ఎకరాలు

మధిరటౌన్, మార్చి25(ఆంధ్రజ్యోతి): జాలిముడి సాగునీటి ప్రాజెక్ట్ ప్రారంభమై పుష్కరకాలం అవుతున్నా రైతుల పొలాలకు సాగునీరు అందిచడంలో మాత్రం ఆయకట్టు కొండంత అయితే నీరు పారేది మాత్రం కూసంతే. మధిర మండలం జాలిముడి వద్ద వైరా నదిపై పలువురు శాసనసభ్యులు సాగునీటి ప్రాజెక్ట్ నిర్మించాలని తలచినా ఎవరికి సాధ్యం కాని దానిని ఉమ్మడి రాష్ట్రంలో 2010 లో ఆనాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో మల్లు భట్టి విక్రమార్క రూ.69 కోట్ల భూసేకరణతో పాటు ప్రాజెక్ట్ నిర్మాణానికి నిదులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ప్రాజెక్ట్ నుంచి 15 కిలోమీటర్లు ఎడమ కాలువల ద్వారా మధిర మండలంలో జాలిముడి, మల్లారం, రొంపిమళ్ళ, సిరిపురం, వంగవీడు, కృష్ణాపురం గ్రామాలకు, 18కిలోమీటర్ల కుడి కాలువ ద్వారా బోనకల్ మండలంలోని రావల్లి, బ్రాహ్మణపల్లి, కలకోట,



రొంపిమళ్ల వద్ద ఆనవాళ్లు లేని కాలువ

రాయన్నపేట, మోటమర్రి గ్రామాల్లో 4,800 ఎకరాలకు సాగునీరు అందించేలా డిజైన్లు రూపొందించి పనులు ప్రారంభించారు. 2015 లో వైరా నదిపై ప్రాజెక్ట్ నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువల పనులు పూర్తికావడంతో రెండు కాలువలకు సాగునీరు విడుదల చేశారు. కానీ డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో అనుకున్న మేర కాలువల ద్వారా పొలాలకు సాగునీరు అందలేదు. దీంతో రైతులు కాలువలకు మోటర్లు పెట్టి పంటలు సాగుచేసుకుంటున్నారు.



శాసన సభ్యుడి హోదాలో భట్టి అనేక వేదికలపై జాలిముడి ప్రాజెక్ట్ నా మానస పుత్రిక అని చెప్పుకోవడంతో రాష్ట్ర విభజన తరువాత అధికారంలో ఉన్న ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పడేసింది. పెండింగ్ పనులతో పాటు భూసేకరణ లో పరిహారం అందని రైతులకు కాని ఒక్క రూపాయి నిదులు కూడా విడుదల చేయకపోవడంతో పాటు మరమ్మతులు కూడా చేయకపోవడంతో అనుకున్న దానిలో నాలుగో వంతు భూములకు కూడా సాగునీరు అందడం లేదు. అందుకు తోడు ఈ సంవత్సరం ఆగస్టులో వైరా నదికి వచ్చిన భారీ వరదలతో కాలువలకు అనేక చోట్ల గండ్లు పడటంతో పాటు, ఎడమ కాలువకు జాలిముడి వద్ద నిర్మించిన యూటీ కొట్టుకు పోయింది. ఇరిగేషన్ అధికారులు గండ్లు పూడ్చించి కొట్టుకుపోయిన యూటీ వద్ద తాత్కాలికంగా పైపులు వేసి రెండు వైపులా సిమెంట్ బస్తాలు వేసి నీళ్ల వదిలినా కాలువలోకి సగం నీరే పారడంతో అరకొరగానే పొలాలకు నీరు అందుతుంది. అందుకు తోడు కుడి ఎడమ కాలువల పొడుగోతు కాలవల్లో చెట్టు పెరిగి కొన్ని చోట్ల కాలువ ఆనవాళ్లు కూడా కనిపించకపోవడంతో ప్రాజెక్ట్ నుంచి నీళ్ల విడుదల చేసినా సక్రమంగా పారడం లేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికైనా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసి నీరు అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సిమెంట్ లైనింగే పరిష్కారం

● లక్ష్మారెడ్డి, రైతు సిరిపురం

ఎడమ కాలువ చాలా వరకు చవుడు భూములు గుండా పోవడంతో మట్టిజారి పడుతుండటంతో కాలువల్లో నీరు పారడం లేదు. కనీసం ఐదు కిలోమీటర్లు అయినా కాలువ రిపేరు చేసి సిమింట్ లైనింగ్ వేస్తే తప్ప నీళ్ల పారవు. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి నిధులు మంజూరు చేయాలి.

నిధులు మంజూరయ్యాయి

● నాగబ్రహ్మయ్య, ఇరిగేషన్ డీఈ

వరదలకు కొట్టుకుపోయిన యూటీ నిర్మాణానికి రూ.47 లక్షల నిధులు మంజూరయ్యాయి. కొందరు రైతులు కాలువ కింద పైర్లు వేశారు, పంటలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. పూర్తి స్థాయిలో మరమ్మత్తుల కోసం రూ.5.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

శరవేగంగా అమరావతి

రైల్వేలైన్ భూసర్వే

» ముమ్మరంగా ఎర్రుపాలెం-నంబూరు రైల్వేపనులు
» ఎర్రుపాలెంలో 3.5కిలోమీటర్లకు 23 ఎకరాల గుర్తింపు
» జంక్షన్‌గా మారనున్న ఎర్రుపాలెం రైల్వేస్టేషన్

ఎర్రుపాలెం, మార్చి25(ఆంధ్రజ్యోతి): ఎర్రుపాలెం నుంచి ఏపీలోని నంబూరు వరకు అమరావతి మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణ ప నులు ఊపందుకున్నాయి. ఎర్రుపాలెం-నంబూ రు అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టును 2018లో కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసింది. మొత్తం 57 కిలోమీటర్ల మేర రైల్వే నిర్మాణం జరగనుంది. రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం తెలంగాణలోని ఖమ్మం జిల్లాతోపాటు ఏపీలోని కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా ఏపీలో భూసేకరణ ఇప్పటికే పూర్తయింది.

ఎర్రుపాలెం -కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో భూసర్వే

కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టుకు సంబంధించి జిల్లాలోని ఎర్రుపాలెం మండలంలో ఎర్రుపాలెం -కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో 23 ఎకరాలు అవసరం ఉంటుందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఎర్రుపాలెం రెవెన్యూ పరిధిలో 275, 276, 306, 307, 308, 309, 310, 311 సర్వేనెంబర్లలో 8 ఎకరాల 30గుంటలు, కేసిరెడ్డిపల్లి రెవెన్యూలో 45,50,51,59,68,69,72,73,74 సర్వేనెంబర్లలో 14 ఎకరాల 20గుంటలు, మొత్తం 23 ఎకరాల 10గుంటలు సర్వే పూర్తి చేశారు. ఈసర్వే నెంబర్లలో సుమారు 3.5కి.మీ. రైల్వేట్రాక్ నిర్మాణం జరగనుంది. రైతులు భూములు ఇవ్వడానికి సుముఖంగానే ఉన్నారు. మొత్తం రూ.2,545 కోట్లతో రైల్వే శాఖ ఈప్రాజెక్టును చేపడుతుంది. ఈ అమరావతి రైల్వేలైన్ ప్రాజెక్టుకు గతేడాది అక్టోబరులో కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించి రైల్వేట్రాక్ నిర్మాణానికి కావాల్సిన ప్రక్రియ వేగంగా జరుగుతుంది. ఈ కొత్త లైన్‌నిర్మాణాన్ని నాలుగేళ్లలో పూర్తిచేస్తామని విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటి ల్ వెల్లడించారు. ఈప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుతం ట్రాక్ నిర్మాణానికి భూ సేకరణ మొ దలు పెడతమని, సేకరణ అవ్వగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

కొత్త రైల్వేలైన్‌తో పెరగనున్న అనుసంధానం

ఈప్రాజెక్టుకు సంబంధించి ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెంలో పెద్ద రైల్వేస్టేషన్ నిర్మించనున్నారు. తర్వాత వరుసగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెద్దాపురం, చెన్నారావుపాలెం,గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరులో కొత్త రైల్వేస్టేసన్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది పూర్తయితే అమరావతి నుంచి విజయవాడ, గుంటూరు, హైదరాబాదు, చెన్నై ప్రాంతాలతో అనుసంధానం ఏర్పడుతుందని రైల్వేశాఖ భావిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ



ఎర్రుపాలెం రైల్వేస్టేషన్

నుంచి అమరావతికి రవాణాతోపాటు వ్యాపార వాణిజ్యాలు మరింత మెరుగవుతాయి. తద్వారా ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా రూపాంతరం చెందుతుంది. ఇరు రాష్ట్రాలకు సరిహద్దులైన ఎన్టీఆర్ కృష్ణాజిల్లా, ఖమ్మంజిల్లాకు రాకపోకలే కాక, ఉద్యోగ, వ్యాపారస్తులకు సౌలభ్యం మరింత పెరగడంతో పాటు సరికొత్త వ్యాపార సామ్రాజ్యాలు పురుడుపోసుకోనున్నాయి.

పరిహారంపై రైతుల ఆశలు

అమరావతి స్టేషన్ అభివృద్ధికి ఏపీ ప్రభు త్వం దాదాపు 1,500 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని అమరావతి రైల్వేస్టేషన్‌ను దేశంలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌గా, మోడల్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వేశాఖ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈప్రాంత భూముల రేట్లకు రెక్కలొస్తాయని రైతులు, రియల్టర్లు భావిస్తున్నారు. ఈప్రాజెక్టుకు భూములు ఇస్తున్న రైతులు సైతం పరిహారం పెద్దమొత్తంలో ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా ఎర్రుపాలెం మండలంలో నాగపూర్ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా మీదుగా విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఎర్రుపాలెం మండలంలో భూమలు ఇచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరానికి రూ.13నుంచి 16లక్షల వరకు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. వాస్తవానికి ఈప్రాంతంలో భూమి మార్కెట్ విలువ ఎకరానికి రూ.4 లక్షలు మాత్రమే ఉంది. ఏపీతో పోలిస్తే ఇది మూడు రెట్లుతక్కువ, బయట భూముల మార్కెట్ విలువ రూ.30లక్షల దాకా పలుకుతుంది. కాగా ఏపీలో భూమి మార్కెట్ విలువ రూ.10లక్షల ఉండగా బయట మార్కెట్ విలువకి సమానంగా (సుమారు రూ.30లక్షలు) పరిహారం చెల్లిస్తున్నారనే వార్తలతో ఇక్కడి రైతులు పరిహారంపై ఆశలు పెట్టుకున్నారు. ఈప్రాజెక్టు ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు ఎంత మొత్తంలో పరిహారం చెల్లించాలో ప్రభుత్వం నిర్ణయించలేదు.

ఆపత్కాల పంటలపై ప్రణాళికలు

వైరా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రెండోరోజు మంగళవా రం జరిగిన మధ్యతెలంగాణ మండలి వ్యవసా య పరిశోధన, విస్తరణ సలహాసంఘ సమావేశంలో ఆపత్కాల పంటలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించారు. వాటిని అనుసరించాల్సిన వ్యూహాల గురించి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌జీ.మహదేవప్ప వివరించారు. సకాలంలో వివిధ పంటల్లో వచ్చే చీడపీడలను వెంటనే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు గుర్తించి తగిన సలహాలు, సూచనలను అందించి నష్టాలను నివారించాలని పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎం.బల రాం పేర్కొన్నారు. వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహదేవప్ప

ఒకవైపు ఎంపికలు..మరోవైపు ధర్నా

» అరకొర యూనిట్లతో తమకు ఒరిగేదేమీ లేదని దివ్యాంగుల ఆగ్రహం

బోనకల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతువేదిక కార్యాలయంలో మంగళవారం ఆర్థిక పునరావాస పథకం కింద దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల ఎంపికలకు సంబంధించి లాటరీ నిర్వహించారు. మొత్తం మండలంలో 257 మంది దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ ద్వారా లబ్ధిదారుడిని ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ఉపాధి కోసం రూ.50వేలు ఇవ్వడం జరుగుతుంది. దీంతో మండల వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులంతా లాటరీ నిర్వహిస్తున్న రైతువేదిక వద్దకు వచ్చారు. అక్కడ డ్రా తీసి ముగ్గురు లబ్ధిదారుల పేర్లను జిల్లాకు పంపిస్తున్నామని, అక్కడ నిర్వహించే ఎంపికల్లో మరోసారి లాటరీ ద్వారా ఒకరిని ఎంపిక చేస్తారని తెలిపారు. మండలంలో ఒక్కరికి మాత్రమే లబ్ధి చేకూరనుండటంతో మిగిలిన వారి పరిస్థితి ఏమిటని దివ్యాంగులు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. పోలీసుల జోక్యంతో వారు వెనుదిరిగారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.రమాదేవి, సీడీపీవో బాలాత్రిపురసుందరీ తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

ఆదివాసీ గ్రామాల్లో తాగునీటి సమస్య

దుమ్ముగూడెం మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో రోజురోజుకు తాగు నీటి సమస్య ముంచుకోస్తోంది. వేసవి సీజనులో తాగునీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ నిత్యం తన అధికారిక సమీక్షల్లో సంబంధిత యంత్రాంగాన్ని ఆదేశిస్తుంటారు. మండలంలో మాత్రం సంబంధిత అధికారులు ఆ ఆదేశాలను అంతగా ఖాతరు చేయడంలేదనే ఆరోపణలున్నాయి. ఈనెల 20న చింతగుప్ప, తోగ్గూడెం, సుజ్ఞానపురం గ్రామాల్లోని మూడు చేతిబోర్లను ఒక కాంట్రాక్టరు ఫ్లషింగ్ చేశారు. ఫ్లషింగ్ చేసి ఐదురోజులు గడుస్తున్నప్పటికీ నేటికీ బోర్లను రీఫిట్టింగ్ చేయలేదు. ముఖ్యంగా తోగ్గూడెం, చింతగుప్ప గ్రామాల్లోని ఆదివాసీలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండల వ్యాప్తంగా నలభై వరకు చేతిబోర్లను ఫ్లషింగ్ చేసినట్లు తెలుస్తోండగా, చాలా చోట్ల వెంటనే రీ ఫిట్టింగ్ చేయ లేదని తెలుస్తోంది. ఈ విషయమై చింతగుప్ప స్పెషల్ ఆఫీసర్ ఉపేంద్రను వివరణ కోరగా, కొంత మిస్ కమ్యూనికేషన్ కారణంగా రీఫిట్టింగ్ ఆలస్యమైందన్నారు. వెంటనే పంపు మెకానిక్‌లతో మాట్లాడి పనులు పూర్తి చేసి తాగునీటిని అందజేస్తామని తెలిపారు.



తోగ్గూడెంలో ఫ్లషింగ్ దృశ్యం(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

అత్తవారింటికి వెళ్తూ కిష్టారంలో ఒకరు, తునికాకు ప్రూనింగ్‌కు వెళుతూ గుండాలలో మరొకరు

సత్తుపల్లిరూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై అత్తవారింటికి వెళ్తా ఓవ్యక్తి రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటనమంగళవారం సత్తుపల్లి మండలం చెరుకుపల్లి సమీపంలోని గిన్నెలటోగు వద్ద చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం... మండంలోని కిష్టారం గ్రామానికి చెందిన పత్తిపాటి వినోద్ (32) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి కొత్తగూడెంలోని అత్తవారింటికి వెళ్లేందుకు బయల్దేరి వెళ్లగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తెల్లవారుజామున అటుగా వెళ్తున్న ఉపాధి హామీ కూలీలు గమనించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వినోద్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్టా దయానంద్, బీజేపీ నాయకుడు ఈవీ.రమేష్ సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.



కిష్టారంలో ఘటన ప్రదేశంలో మృతదేహం



అక్బర్

తునికాకు ప్రూనింగ్ పనులకు వెళుతు..

గుండాల: అతివేగం కారణంగా మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా జంగాలపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అక్బర్(52) ములుగు నుంచి గుండాలకు తునికాకు ప్రూనింగ్ పనులు నిర్వహించేందుకు వస్తున్నాడు. ఈక్రమంలో దేవళ్లగూడెం సమీపంలోని మూలపలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో సయ్యద్ అక్బర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన ప్రాంతానికి చేరుకున్న సీఐ రవీందర్ మృతదేహాన్ని ములుగు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి25(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగం ప్రమాదంలో ఉందని రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఖమ్మంనగరంలోని ఆపార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. గ్రామాలలో బహుజన మహనీయుల సిద్ధాంతాలను వివరిస్తూ కార్యకర్తలను తయారుచేయాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఉపేంద్రసాహు, జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, అయితగాని శ్రీనివాస్‌గౌడ్, ఎం.పుల్లయ్య పాల్గొన్నారు.

వన్‌నేషన్..వన్ ఎలక్షన్ విప్లవాత్మక మార్పు

బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవకి

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో వన్‌నేషన్ వన్ ఎలక్షన్ విప్లవాత్మక మార్పుకు నాంది కానుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవకి వాసుదేవరావు అన్నారు. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో మంగళవారం ఏకకాలిక సంస్కరణ ఎన్నికల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల వ్యయం తగ్గించి అభివృద్ధికి బాటలు వేయవచ్చని, బీజేపీ నాయకులు ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన చేసుకుని డివిజన్ల వారీగా పోలింగ్‌బూత్‌ల వారీగా ప్రజలకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంద సరస్వతి, గడీల నరేష్, తుమ్మ శివ, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, శేఖర్, రాజేష్‌గుప్తా, రుద్రగాని ప్రదీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవరావు

కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలి

» అక్రమ రవాణాపై నిఘాపెట్టి కట్టడి చేయాలి
» నేరసమీక్ష సమావేశంలో ఖమ్మం సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మం మార్చి25(ఆంధ్రజ్యోతి): కీలకమైన కేసుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేసేవరకు ప్రతీఅంశంలో కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లాలోని పోలీసు అధికారులతో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, పోక్సో కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే అక్రమ రవాణాలను పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి పూర్తిగా కట్టడి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టే రోడ్డు విస్తరణ పనులు వంటి కార్యక్రమాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అధికారులతో సమన్వయ సహకారం అందించాలన్నారు. బెట్టింగ్, లోన్ యాప్ కార్యక్రమాలపై పూర్తిగా నిఘాను పెంచాలన్నారు. ఎక్కడైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారన్న సమాచారం వస్తే వెంటనే దాడులు చేయాలన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో విజబుల్ పోలీసింగ్ అమలు చేయాలని తద్వారా నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. తీవ్రమైన నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తుల్లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పెండింగ్‌లో ఉన్న ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్, పోస్టుమార్టం రిపోర్ట్స్, నేరస్థుల అరెస్ట్ చేయని కేసుల్లో వెంటనే నేరస్థులను అరెస్ట్ చేసి విచారణ పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేయాలని ఆయన సూచించారు. అలవాటుగా నేరాలు చేసే నేరస్థులపై హిస్టరీ షీట్లను తెరిచి, సరిహద్దు జిల్లాల పోలీస్‌స్టేషన్ల అధికారులతో నిరంతరం సమచారాన్ని పంచుకుంటూ వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, ట్రెయినీ ఐపీఎస్ సాయి రుత్విక్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహమాన్, రఘు, వెంకటేష్, సాంబరాజు, రవి, సర్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై విచారణ

వైరా,మార్చి25(ఆంధ్రజ్యోతి): వైరాలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సమతపై జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి విచారణ నిర్వహించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేయటంతో మంగళవారం ఈ విచారణ జరిపారు. సమత విద్యార్థినుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని, అధికార నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, విధులకు గైర్హాజరవుతున్నారని సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వైరా వచ్చి విచారణ చేశారు. ప్రిన్సిపల్ సమతను ఇతర ఉపాధ్యాయనీలను, సిబ్బందిని విచారించారు. అక్కడకు వచ్చిన కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి కూడా వివరాలను సేకరించారు. తన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు.



ప్రిన్సిపల్‌ను విచారిస్తున్న జోనల్ అధికారి

కార్లకు నిప్పంటించిన దుండగులు

» రెండు వాహనాలు పూర్తిగా దగ్ధం

చుంచుపల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఒక కారుకు నిప్పంటింగా, ఆ మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న మరో కారుకు అంటుకొని ఆ రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు ఒకటిన్నర గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు రామవరం సుభాష్‌చంద్రబోస్ నగర్(ఎస్సీబీనగర్) ప్రాంతంలో పార్కింగ్ చేసి ఉన్న కారు వద్దకు వెళ్లారు. ఒక కారుపై పెట్రోల్ పోసి లైటర్ సహాయంతో నిప్పంటించారు. మంటలు ఎగసిపడడంతో గమనించిన స్థానికులు కొత్తగూడెం పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారాన్ని అందజేశారు. మంటలను సిబ్బంది అదుపు చేసేలోపు ఆరెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.బాధితులు కొత్తగూడెం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.



దగ్ధమైన కార్లు

బేతుపల్లిలో మరో కారు..

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బేతుపల్లికి చెందిన చాంద్‌పాషా కారును గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తెల్లవారుజామున ఇంటిముందు నిలిపి ఉంచిన మహేంద్ర థార్‌కార్‌పై పెట్రోల్ పోసి నిప్పు అంటించగా, చుట్టుపక్కల వారు వచ్చి ఆర్పివేసిన అప్పటికే దగ్ధమైంది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రిటైర్డ్ వీఆర్వో హఠాన్మరణం

నేలకొండపల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిరుమలాపుచెందిన రిటైర్డ్ వీఆర్వో చెరువు సీతారామయ్య(85) మంగళవారం తెల్లవారుఝామున గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి ఇరువురు కుమార్తెలున్నారు. సీతారామయ్య మృతి సమాచారం తెలుసుకున్న పలువురు రైతులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి సంతాపం తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, దంత వైద్యుడు నాగుబండి శ్రీనివాసరావు, తెల్లాకుల నాగేశ్వరరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించినవారిలో ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఖమ్మంలీగల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం కోర్టుకు చెందిన న్యాయవాది ఇస్రాయిల్‌ను సోమవారం హత్య చేయటాన్ని నాయ్యయవాదులు ఖండించారు. ఐలు, ఐఏఎల్, తెదేపా, కాంగ్రెస్, బీఆర్ఎస్ లీగల్ సెల్, ఖమ్మం జిల్లా నోటరీ న్యాయవాదుల హత్యను ఖండించాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు.

అనారోగ్యంతో విలేకరి మృతి

అశ్వాపురం, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఓపత్రికా విలేకరి మదమంచి సత్యనారాయణ(45) మంగళవారం తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు. సత్యనారాయణ కొద్దిరోజులుగా కాలేయం సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో కొత్తగూడెంలోని ఓప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, మూడు సంవత్సరాల కూతురు ఉంది.

సదాశివునిపేటలో చోరీ

సత్తుపల్లిరూరల్,మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివునిపేటలో చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాల్నేని రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. బీరువాలోని రూ.2లక్షల విలువైన ఆభరణాలతో పాటు రూ.35వేలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గళమెత్తిన కార్పొరేటర్లు

- డివిజన్ సమస్యలపై ప్రశ్నల వర్షం
- అభివృద్ధిలో రాజకీయాలు చూడొద్దని విన్నపాలు
- వాడివేడిగా సాగిన కేఎంసీ బడ్జెట్ సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కేఎంసీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.188కోట్ల31లక్షలతో ఖమ్మం నగర బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ మేరకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరపాలక సంస్థకు సంబంధించి ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, ఆదాయ, ఖర్చు వివరాలు, 2024-2025 సవరించిన బడ్జెట్ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. బడ్జెట్ సమావేశానికి ముందు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలను విడివిడిగా ఎకౌంట్స్ విభాగం అధికారి శివలింగం ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి బడ్జెట్ పత్రాలతో కూడిన బ్యాగ్‌లను అందించారు. కాగా పలువురు కార్పొరేటర్లు వారివారి డివిజన్లలో సమస్యలపై గళమెత్తారు. బడ్జెట్ సమావేశాలకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు వారి పార్టీ జెండాలతో సమావేశ మందిరంలోకి అడుగు పెట్టారు. కాంగ్రెస్ కార్పొరేటర్లుకు మేయర్ పునుకొల్లు నీరజ కాంగ్రెస్ కండువాలను పంపిణీ చేసినా కొంతమంది జేబులో పెట్టుకున్నారు. తర్వాత ఒక్కరిద్దరు కాంగ్రెస్ కార్పొరేటర్లు కండువాలను కప్పుకున్నారు.

మంత్రి వర్గీయులు వర్సెస్ మాజీ మంత్రి వర్గీయులు

మామంత్రి అభివృద్ధి కార్యక్రమాలు చేశారంటే.. కాదు మా మాజీ మంత్రే అంటూ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి మధ్య వాగ్వాదం జరిగింది. ఖమ్మం బస్టాండ్ నుంచి అన్ని ముఖ్యమైన నిర్మాణాలు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నిధులు మంజూరు చేశారని కర్నాటి కృష్ణ మాట్లాడారు. దీనికి వెంటనే కమర్తపు మురళి కౌంటర్ ఎటాక్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపనలు చేస్తే మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కాంట్రాక్టర్‌గా మారి పనులు చేశారని, నిధులు మంజూరు చేయించిన వారికే ఖ్యాతి దక్కుతుందని, కాంట్రాక్టర్ పనులు చేసిన వారికి కాదని కమర్తపు మురళీ ఖండించారు. దీంతో వాతావరణం రాజకీయంగా వేడెక్కింది.



బడ్జెట్ పత్రాలను మేయర్‌కు అందిస్తున్న ఏవో

సమావేశం సమయానికి మొరాయించిన లిఫ్టు

ఇటీవల లిఫ్టు ప్రమాదాల నేపథ్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం లిఫ్టు చర్చనీయాంశంగా మారింది. మంగళవారం కేఎంసీలో బడ్జెట్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు కేఎంసీ కార్యాలయానికి చేరుకునే సమయానికి సరిగ్గా లిఫ్టు మొరాయించింది. దీంతో మేయర్ నుంచి అందరూ రెండో లిఫ్టు నుంచి రాకపోకలు చేశారు. ఒకే లిఫ్టుతో తాకిడి పెరగటంతో కొంతమంది కార్పొరేటర్లు మూడోఫ్లోర్ నుంచి కాళ్లకు పని చెప్పి మెట్లు దిగారు.

అవినీతిపై ఆధారాలు అందించినా చర్యలు లేవు

పగడాల శ్రీవిద్య, 53వ డివిజన్ కార్పొరేటర్



మాడివిజన్‌లో జరిగిన అవినీతిపై అధికారులకు ఆధారాలతో సహా వివరాలు పంపినా కానీ చర్యలు మాత్రం తీసుకోలేదు. ప్రాంతాలతో సంబంధం లేకుండా అభివృద్ధి జరపాలి. సాధారణ సమస్యలు పరిష్కారానికి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి. 8నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగలేదు.

ఆ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలి

బీజీ క్లెమెట్, 43వ డివిజన్ కార్పొరేటర్



కేఎంసీలో పదేళ్లుగా 16మంది ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో వాటర్ సప్లయ్ విభాగంలో పని చేస్తున్నారు. రెండేళ్లుగా వీరికి వేతనాలు చెల్లింపుపై గందరగోళం ఏర్పడింది. పాలకవర్గం ఆమోదించి వీరిని ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలి.

పైసా నిధులు ఇవ్వలేదు..

నాగండ్ల కోటేశ్వరరావు, 6వ డివిజన్ కార్పొరేటర్



గత బడ్జెట్‌లో డివిజన్‌కు కేటాయించిన నిధుల్లో పైసా కూడా మంజూరు చేయలేదు. ట్రాక్టర్ మట్టి కూడా నా డివిజన్‌లో పోయలేదు. విలీన డివిజన్ అని చిన్న చూపు చూస్తున్నారు. మాడివిజన్‌లో రూ.కోట్లతో భవనాలు నిర్మాణం జరగటంలో కేఎంసీకి ఆదాయం వస్తోంది. అందులో కనీసం 50శాతం నిధులు మా డివిజన్‌కు కేటాయించాలి. అభివృద్ధిపై రాజకీయ వివక్ష చూపొద్దు.

డివిజన్‌లకు కార్మికుల సంఖ్య పెంచాలి

కన్నం వైష్ణవి, 46వ డివిజన్ కార్పొరేటర్



మా డివిజన్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, క్యాంపు కార్యాలయాలు అధికంగా ఉన్నాయి. డివిజన్ పరిధి ఎక్కువగా ఉంది, పారిశుధ్య కార్మికుల కొరత అధికంగా ఉంది. కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వాటికి అపరేషన్లు చేయించాలి. మున్నేరు ముంపు ప్రాంతం కావటంతో వరద ప్రభావం ఏర్పడుతోంది. వేసవికాలంలోనే చర్యలు తీసుకోవాలి.

కమ్యూనిటీ భవనాలకు మరమ్మతులు చేయాలి

కమర్తపు మురళి, 24వ డివిజన్ కార్పొరేటర్



నగరంలో కమ్యూనిటీ భవనాలను మరమ్మతులు చేయాలని కోరారు. గ్రౌండ్ ఫ్లోర్‌కు అనుమతి తీసుకొని అదనంగా ఫ్లోర్ల నిర్మాణం చేస్తున్నారని వాటికి ట్యాక్స్ కలెక్షన్ చేయాలని కోరారు. ఖమ్మంలో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని కోరారు. 10వేల నివాసాల వరకు ఇంటి పన్నులు వసూళ్లు కావటం లేదన్నారు. కేఎంసీకి తసీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్‌లను కేటాయించాలని కోరారు.

పాఠకులకు వసతులు కల్పించాలి

- పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



నిరుద్యోగ యువతితో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి25 (ఆంధ్రజ్యోతి): పాఠకులకు జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంథాలయంలో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా గ్రంథాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలో ఉన్న ఆర్ఓ వాటర్ ప్లాంట్, టాయిలెట్స్, నూతనగంగా నిర్మించిన ప్రహరీ గోడలను పరిశీలించారు. గ్రంథాలయ ఆవరణను చదునుగా చేయాలని ఆదేశించారు. గ్రంతాలయంలోని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో, పాఠకులతో మాట్లాడారు. ఏపోటీ పరీక్షకు సిద్ధమవుతున్నారు, ఎటువంటి పుస్తకాలు కావాలో వివరాలు అందిస్తే పది రోజుల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాత పుస్తకాలను మార్చి ఎప్పటికప్పుడు నూతన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ సిబ్బందికి సూచించారు. ఈ లైబ్రరీ ఉర్పాటుకు చర్యలు తీసుకోవాలని అవసరమైన కంప్యూటర్లు, హెడ్‌సెట్‌లను అందిస్తామన్నారు. లైబ్రరీలో పాఠకులందరికి 15 రోజులలో ఐడి కార్డులు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి అర్జున్, రవిబాబు, బాబురావు, విజయ్, భాస్కర్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

- జడ్పీ సీఈవో దీక్షరైనా
- కారుణ్య నియామకాల అభ్యర్థులకు దిశానిర్దేశం

ఖమ్మంకలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విధులను బాధ్యతాయుతంగా.. అంకితభావంతో నిర్వహించిన రోజునే ప్రజల అభిమానాన్ని చూరగొంటారని జిల్లా పరిషత్ సీఈవో దీక్షరైనా అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఇటీవలె కారుణ్యనియామకాల కింద నియమితులైన 27 మంది అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి విధులపై దిశానిర్దేం చేశారు. ఇప్పటివరకు మీరు కాలేజీ, విద్యార్థిగా అంశాలను మాత్రమే నేర్చుకున్నారని, ప్రభుత్వ ఉద్యోగిగా నేటినుంచి మీరు కొత్తజీవితంలోకి అడుగిడుతున్నారని అన్నారు. ఉద్యోగ బాధ్యతలు మీపై మరింత బాధ్యతను పెంచుంతుందన్నారు. అందుకే కొత్తగా ఉద్యోగాల్లో చేరిన మీరంతా అంకితభావంతో సేవా దృక్పథంతోప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం వారికి పలు అంశాల్లో వివిధ రంగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కె నాగపద్మజ, మినిస్టీరియల్ ఉద్యోగసంఘం అధ్యక్ష కార్యదర్శులు మామునూరు రాజేష్, జిల్లా పరిషత్ పర్యవేక్షకులు గుప్తా, రమణశేఖర్, రమణ, బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కారుణ్య నియామకాల అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో దీక్షరైనా

స్కేటింగ్‌లో న్యూఇరా విద్యార్థి ప్రతిభ



ఖమ్మంస్పోర్ట్స్, మార్చి25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి లోహిత్‌అభిరామ్ ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించాడని పాఠశాల యజమాన్యం తెలిపింది.లోహిత్ అండర్-10 500మీటర్ల విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడని తెలిపారు. సదరు విద్యార్థిని పాఠశాల చైర్మన్ ఐవి రమణారావు, డైరెక్టర్ పి.భూమేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వెంకయ్య

ఖమ్మంస్పోర్ట్స్‌మార్చి25(ఆంధ్రజ్యోతి): యువత ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ వెంకయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెడ్‌రిబ్బన్ క్లబ్ చేపట్టిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ఎయిడ్స్ విస్తృతంగా వ్యాపిస్తుందని దీనిని అరికట్టేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఈసం నారాయణ, జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్ ఎణివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, మార్చి25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ ని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. నగరలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం మీడియా చిట్‌చాట్ నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా కాషాయా జెండాను రెపరెపలాడడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. అధికారపక్షం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు జిల్లాలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య,అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివసరావు, ధనియాకుల వెంకటనారాయణ, పాల్గొన్నారు.

జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కవితకు డాక్టరేట్



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాలలో జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్గుల కవితకు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా మంగళవారం తెలిపారు. కేయు జంతు శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పర్యవేక్షణలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కవితను పలువురు అభినందించారు.

పిండిప్రోలు సంత రూ.30.30లక్షలు

తిరుమలాయపాలెం, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామపంచాయతీలో మంగళవారం వారపుసంతను నిర్వహించారు. ఎంపీడీవో ఎస్కే సిలార్‌సాహెబ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు.ఈవేలంలో 89మంది పాల్గొన్నారు. వరంగల్ జిల్లా నర్సింహులపేటకు చెందిన అప్పల సుదర్శన్ రూ.30లక్షల 30వేలకు వేలం పాడారు. గతేడాది సంత రూ.14లక్షలకు వేలం నిర్వహించగా ఈసారి రెట్టింపుస్థాయిలో వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో రాంబాబు, కార్యదర్శి రాము, సుజాత, పుల్లయ్య, సైదులుపాల్గొన్నారు.

రాబడి పెంపునకు కృషి

(5వ పేజీ తరువాయి)

ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఎమ్మెల్సీ తాతామధు సమావేశానికి హాజరయ్యారు. తాను సమావేశానికి వచ్చే సమయానికి తనకు కేటాయించాల్సిన సీటు లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. తాతామధు మాట్లాడుతున్న సమయంలో కమిషనర్ స్పందించి తాము సీటు కేటాయించామని చెప్పడంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలుగజేసుకుని ఇకముందు అలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామనీ చెప్పడంతో సమావేశం ముందుకుసాగింది. అయితే అధికారులు ఎమ్మెల్సీ తాతా మధు కోసం సీటు కేటాయించి బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కార్పొరేటర్లు లోపలికి వచ్చే సమయంలో ఆ బోర్డు పడిపోయినట్టు తెలిసింది. సమావేశంలో కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు సంవత్సరానికి ఒకసారి సమావేశం ఏర్పాటు చేస్తే ఇక ప్రజా సమస్యలపై ఎప్పుడు చర్చిస్తారంటూ ప్రశ్నించారు. దాంతో మేయర్ పునకొల్లు నీరజ దానికోసం వచ్చేనెల ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశం ప్రారంభం తర్వాత ఇటీవల కాలంలో మృతి చెందిన మూడో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్‌కు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యసంస్థలపై మరోసారి సర్వే

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ- అసెస్మెంట్ చేయడం ద్వారా 60 లక్షల వరకు ఆదాయం పెరిగిందని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో 60 వార్డులలో రీ-అసెస్మెంట్ సర్వే నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నగరంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా, రిజిస్ట్రేషన్ చేసుకునేలా సర్వే చేపడతామన్నారు. నగరంలో వాణిజ్య సంస్థలు 7 వేలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో మరోసారి సర్వే చేపడుతామన్నారు. నగరంలో 60 డివిజన్లను 5 జోన్లుగా (నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్) విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామనీ, రాబోయే కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ముందు ఈ ప్రణాళిక ఉంచుతామన్నారు.

ప్రతీజోన్‌లో రెవెన్యూ అధికారి, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఈ టౌన్ ప్లానింగ్ ఉండేలా చూస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు జోనల్ స్థాయిలో పరిష్కరించేలా చూస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 131 వాహనాలలో జీపీఎస్ ట్రాకర్, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లకు జీపీఎస్ వాకీ టాకీలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో జవాన్లకు సైతం వాకీ టాకీలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామనీ, ప్రతీడివిజన్ కు 2 అదనపు పారిశుధ్య కార్మికులను కేటాయిస్తామని అన్నారు. పారిశుధ్య కార్మికులకు టర్మ్ బీమా అందించామని, రాబోయే సంవత్సరం హెల్త్ బీమా అందిరించేందుకు కృషి చేస్తామన్నారు. 19 నూతన ట్రాక్టర్లు, 30 ఆటోలు, 2 గడ్డికోత యంత్రాలు, 2 డీ సీల్టింగ్ యంత్రాలు, 2వాక్యూం యంత్రాలు కొనుగోలుకు టెండర్లు పిలిచామన్నారు. వారంలో రోడ్డు స్వీపింగ్ యంత్రం డెలివరీ అవుతుందని అన్నారు.



వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ పిలుపుమేరకు ఈనెల27న తలపెట్టిన ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కరపత్రాలను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. కైకొండాయిగూడెం, బల్లేపల్లి, ఖానాపురం హవేలీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. నాయకులు కే.శ్రీనివాస్, జే భరత్, ములకపల్లి లక్ష్మీనారాయ, ధరణ్‌కృష్ణ, వనతి లింగమ్మ, బిక్షమయ్య పాల్గొన్నారు.



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ధ్యాన తరగతులు ప్రారంభం

రామచంద్రామిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ నరేందర్

నేలకొండపల్లి,మార్చి25(ఆంధ్రజ్యోతి): ధ్యానం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందని, ధ్యానం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని రామచంద్రా మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కో-ఆర్డినేటర్ నరేందర్ అన్నారు. స్థానిక సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో మూడు రోజుల పాటు సాయంత్రం వేళల్లో నిర్వహించనున్న ధ్యానోత్సవం తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి ప్రకాశరావు, గెల్లా జగన్మోహన్‌రావు, దండా రవీంద్రబాబు, గెల్లా వెంకటరమణ గుప్తా, వాసం లక్ష్మయ్య, తెల్లగొర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



ధ్యానోత్సవం తరగతుల్లో మాట్లాడుతున్న నరేందర్

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

సీపీఎం జిల్లా నాయకుడు రమేష్

నేలకొండపల్లి,మార్చి25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ ఇన్‌చార్జ్, జిల్లా నాయకుడు బండి రమేష్ డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నేలకొండపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జాదవ్ మాణిక్యానికి అందించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రమేష్ మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు హామీ తప్ప ఏహామీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. మహిళలను నెలకు రూ.2500, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఆర్థికసాయం ఏమైందని ప్రశ్నించారు. సీపీఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్రాశ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ఇంటికి రూ.5లక్షల హామీ నేటికీ అమలు కాలేదన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయటానికి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సీపీఎం రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సైతం వెనుకాడదని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కెవిరెడ్డి, జిల్లా నాయకుడు గొడవర్తి నాగేశ్వరరావు, నాయకులు షేక్.బషీర్, ఏటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు, రాసాల కనకయ్య, భూక్యా కృష్ణ, ఇంటూరి అశోక్, పగిడికత్తుల నాగేశ్వరరావు, బలుసు ప్రమీల, కట్టికోల వెంకన్న, భాస్కర్, మందడపు మరళి, మంకెన నర్సింహారావు, పెద్దిరాజు నర్సయ్య, దండా సూర్యనారాయణ పాల్గొన్నారు.



నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కళాపీఠం ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి,మార్చి25(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి, భక్తరామదాస విద్వత్ కళాపీఠం ఆధ్వర్యంలో, నేలకొండపల్లి భక్తరామదాస ధ్యాన మందిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ దాదాపు 60మందికి దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో సాధు రాధాకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, వాసం లక్ష్మయ్య, మన్నె కోటేశ్వరరావు, ఓరుగంటి నారాయణరావు, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదా బిల్లు రద్దు చేయాలి: విద్యా పరిరక్షణ కమిటీ

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్ఈపీ 2020 యూజీసీ ముసాయిదా బిల్లును వెంటనే రద్దు చేయాలని విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకుడు తాళ్లూరి వేణు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ(ఎన్డీ) ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా సెమినార్ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు కేటాయించలేక పోయిందని ఆక్షేపించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత విద్యాసమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, పవన్, ప్రశాంత్, శ్రీకాంత్, దినేష్, కౌసల్య, మేఘన, రవి, చరణ్, సాయికుమార్, హరిచందు, మహిధన్ పాల్గొన్నారు.

ముస్లింలకు సరుకుల పంపిణీ



తిరుమలాయపాలెం, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింతోపాటు నిరుపేద కుటుంబాలకు ఎస్డీ మదార్‌సాబ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసరల సరుకులను మంగళవారం పంపిణీచేశారు. సుమారు వెయ్యి మందికి 12రకాల నిత్యావసరాలను ఆత్మకమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ, ఎస్ఐ2 రామలింగారెడ్డి, ట్రస్టు ఛైర్మన్ ఎస్డీ ఇమాం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పెద్దమదార్ సాహెబ్, ఎస్డీ సైదా, ఇమామ్, సిలార్, ఎస్కే చాంద్, కాంగ్రెస్ నాయకులు యన్నం సుధాకర్‌రెడ్డి, కరీం, చింతా వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుక్లా కవిత్వం..సామాన్యుడి భావోద్వేగాలు

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి25(ఆంధ్రజ్యోతి):సామాన్యుడి భావోద్వేగాల అక్షర రూపమే జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత వినోద్ కుమార్ శుక్లా కవిత్వమని కేంద్రసాహిత్య అకాడమీ సభ్యుడు కవి ప్రసేన్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో లిటరరీ కమిటీ, హిందీవిభాగం బుక్ రీడర్స్ క్లబ్ సంయుక్తం ఆధ్వర్యంలో శుక్లా రచనా శైలిని కవిత్వ విభిన్నతని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా, వైస్‌ప్రిన్సిపాల్ బానోత్‌రెడ్డి, లిగరరీ కమిటీ కన్వీనర్ సీతారాం, సభ్యులు రవికుమార్, రమణ, అధ్యాపకులు మధు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

కూసుమంచి, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం జుజ్జులరావుపేట వద్ద బ్రిడ్జికింద బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో పాలేరు గ్రామానికి చెందిన వల్లెపు వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో క్షతగాత్రుని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జోరుగా ఇసుక రవాణా..

» నిఘా పెట్టినా జోరుగా ఇసుక డంప్‌లు » అక్రమంగా ఆంధ్రానుంచి చేరుతున్న గోదావరి ఇసుక ?



జవహర్ నగర్‌లో ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, మార్చి25(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఇసుక మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇసుక అక్రమ రవాణా చేయవద్దని పోలీసులు హెచ్చరించినా.. వినకుండా అదేతంతుగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో ఇసుక రవాణా కొంతమందికి కాసుల వర్షం కురిపిస్తుండగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ప్రభుత్వం ఇంకా నూతన ఇసుక పాలసీ విధివిధానాలను ప్రకటించకపోవడంతో అడిగేవారు.. అడ్డుకునేవారు లేకపోవడంతో ఇష్టారీతిన ఇసుక తరలిస్తూ రూ.లక్షల్లో దండుకుంటున్నారు. దీంతో అక్రమార్కులు పెద్దఎత్తున పట్టణంలో ఏర్పాటుచేసిన ఇసుక డంప్‌లకు టిప్పర్లు, లారీల ద్వారా చేర్చి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా విక్రయిస్తున్నారు.

నూతన ఇసుక పాలసీ వస్తేనే...

నూతన ఇసుక పాలసీ అమల్లోకి వచ్చేవరకు గోదావరి తీర ప్రాంతాలతో పాటు సమీప ప్రాంతాల్లోని వాగుల నుంచి తట్టెడు ఇసుక కూడా బయటకు రావొద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెప్పినా అవేమీ సత్తుపల్లిలో వ్యాపారులకు పట్టనట్లుగా ఉంది. ఇదేవరకే అధికారులు ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశాలు రావడంతో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అడపాదడపా దాడులు చేపట్టి, కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఇసుక దొరకగా అన్నిచోట్లా గృహ నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు ఆంధ్రాతో పాటు సమీపంలోని వాగుల నుంచి ఇసుకను అక్రమంగా సత్తుపల్లి పరిసర ప్రాంతాలకు లారీలకు లారీలు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

గతంలో టన్ను ఇసుక రూ.1,100కాగా రూ.4,800ఉండగా తాజాగా ఇసుక లారీ టన్నులు లెక్క రూ.1,300 కాగా ట్రాక్టర్ రూ.6వేలు విక్రయిస్తున్నట్లు సమాచారం. కాగా మండలంలోని తమ్మిలేరుతో పాటు చెరుకుపల్లి అడవుల్లోని ఇసుక గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో రవాణా అవుతుందని, వీటిపై సంబంధిత అధికారులు నిఘా పెట్టరనే వాదన మండల వ్యాప్తంగా వినిపిస్తుంది.

ఇసుక నియంత్రణ కమిటీలెక్కడ..?

మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా మాదిరిగా ఇసుక దందాను కూడా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గుట్టలు, క్వారీలు, సింగరేణిలో పోయే భూముల్లో మట్టి తవ్వుకున్న వ్యాపారస్తులు కోట్లకు పడగలెత్తినట్లే.. మండల కేంద్రంలోని వివిధ శాఖల్లోని అధికారులతో ఇసుక నియంత్రణ కమిటీలను వేసినప్పటికీ ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణాను అరికట్టిన పాపాన పోలేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇసుక నియం త్రణ కమిటీలు పేపర్లకే పరిమితమయ్యాయఇసుక లారీలు, ట్రాక్టర్లను పట్టుకున్న అధికారులు కేసులు నమోదు చేయకుండా వాల్టాచట్టం ప్రకారం కొద్దిమేర జరిమానా వేసి వదిలిపెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా మండలంలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పటిష్ట నిఘా ఉంచాం...

● కిరణ్, పట్టణ సీఐ, సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలల్లో ఇసుక అక్రమణ రవాణా, డంప్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాము. ఇప్పటికే పలు కేసులను నమోదు చేశాం అనుమతులు లేకుండా ఇసుక డంపింగ్ చేసినా, లారీల ద్వారా ఇసుక రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయి.

ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదు...

● కే.యోగేశ్వరరావు, తహసీల్దార్, సత్తుపల్లి

ఆంధ్రాలోని గోదావరి, మండలంలోని వాగుల నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే సహించేది లేదు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వాల్టాచట్టంలోని అధికారుల బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాము. కార్యాలయ పనివేళలు, ప్రభుత్వ కార్యకలాపాలు, రైతుల సమస్యలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో తమ రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖలు సైతం ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాపై పర్యవేక్షణ ఉంచాలని కోరారు.

రాబడి పెంపునకు కృషి



వాగ్వాదానికి దిగిన నాయకులు

(5వ పేజీ తరువాయి)

ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఎమ్మెల్సీ తాతామధు సమావేశానికి హాజరయ్యారు. తాను సమావేశానికి వచ్చే సమయానికి తనకు కేటాయించాల్సిన సీటు లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. తాతామధు మాట్లాడుతు న్న సమయంలో కమిషనర్ స్పందించి తాము సీటు కేటాయించామని చెప్పడంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలుగజేసుకుని ఇకముందు అలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామనీ చెప్పడంతో సమావేశం ముందుకుసాగింది. అయితే అధికారులు ఎమ్మెల్సీ తాతా మధు కోసం సీటు కేటాయించి బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కార్పొరేటర్లు లోపలికి వచ్చే సమయంలో ఆ బోర్డు పడిపోయినట్టు తెలిసింది. సమావేశంలో కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు సంవత్సరానికి ఒకసారి సమావేశం ఏర్పాటు చేస్తే ఇక ప్రజా సమస్యలపై ఎప్పుడు చర్చిస్తారంటూ ప్రశ్నించారు. దాంతో మేయర్ పునకొల్లు నీరజ దానికోసం వచ్చే నెల ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశం ప్రారంభం తర్వాత ఇటీవల కాలంలో మృతిచెందిన మూడో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్‌కు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యసంస్థలపై మరోసారి సర్వే: కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ముందుగా 43వ వార్డులో పన్నుల రీ- అసెస్మెంట్ చేయడం ద్వారా 60 లక్షల వరకు ఆదాయం పెరిగిందని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో 60 వార్డులలో రీ-అసెస్మెంట్ సర్వే నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నగరంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండేలా, రిజిస్ట్రేషన్ చేసుకునేలా సర్వే చేపడతామన్నారు. నగరంలో వాణిజ్య సంస్థలు 7 వేలు మాత్రమే రిజిస్టర్ అయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో మరోసారి సర్వే చేపడుతామన్నారు. నగరంలో 60 డివిజన్లను 5 జోన్‌లుగా (నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్) విభజించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామనీ, రాబోయే కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల ముందు ఈ ప్రణాళిక ఉంచుతామన్నారు.

ప్రతీ జోన్ లో రెవెన్యూ అధికారి, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఏఈ టౌన్ ప్లానింగ్ ఉండేలా చూస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు జోనల్ స్థాయిలో పరిష్కరించేలా చూస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 131 వాహనాలలో జీపీఎస్ ట్రాకర్, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లకు జీపీఎస్ వాకీ టాకీలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో జవాన్లకు సైతం వాకీ టాకీలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామనీ, ప్రతి డివిజన్ కు 2 అదనపు పారిశుధ్య కార్మికులను కేటాయిస్తామని అన్నారు. పారిశుధ్య కార్మికులకు టర్మ్ బీమా అందించామని, రాబోయే సంవత్సరం హెల్త్ బీమా అందిరించేందుకు కృషి చేస్తామన్నారు. 19 నూతన ట్రాక్టర్లు, 30 ఆటోలు, 2 గడ్డి కోత యంత్రాలు, 2 డీ సిల్టింగ్ యంత్రాలు, 2 వాక్యూం యంత్రాలు కొనుగోలుకు టెండర్లు పిలిచామన్నారు. వారం రోజులలో రోడ్డు స్వీపింగ్ యంత్రం డెలివరీ అవుతుందని అన్నారు.

అభయాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

తల్లాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం గంగదేవిపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, బీజేపీ జిల్లా నాయకుడు ఆపతి వెంకటరామారావు, సొసైటీ డైరెక్టర్ రేగళ్ల సత్యం, ఆలయ కమిటీ సభ్యులు సాయిన్ని నాగేశ్వరరావు, రేగళ్ల లక్ష్మణ్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కల్లూరు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామ పంచాయతీ తరుపున మంగళవారం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. పంచాయతీ ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా పట్టణంలో బోర్‌వెల్స్‌కు మరమ్మతు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వజీర్ మీయా, చింతపల్లి శ్రీను, చారి, నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ అజయ్‌కు పరామర్శ



అజయ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

కల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు, బీఆర్‌ఎస్ ప్రముఖ నాయకుడు కట్టా అజయ్‌కుమార్ ఇటీవల కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని స్వగ్రామం వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్లు నర్వనేని అంజయ్య, చావా వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ ఛైర్మన్ పెద్దబోయిన మల్లేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మేకల కృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు రావి సూర్య నారాయణ, గంగవరపు వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, సరాబు వెంకటేశ్వరరావు, కుక్కా అంజారావు, కల్యాణపు కొండలరావు, చింతలపూడి బారిష్టర్, పుసునూరి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కట్టా అర్జప్ప, బీవీ.పెద్దబోయిన నారాయణరావు, చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, తాళ్లూరి అచ్చయ్య, బాణోత్ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో భోజనం వడ్డిస్తున్న దయానంద్

ఇఫ్తార్ విందులతో సోదరభావం

సత్తుపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వెంగళరావు నగర్ మసీద్‌లో ముస్లిం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలను ఎంతో భక్తిశ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

సత్తుపల్లిరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఆవు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని కిష్టారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈడా శ్రీనుకు చెందిన ఆవు మేత కోసం వెళ్లగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినది. ఆవు విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

సకాలంలో పంటలను కొనుగోలు చేయాలి

» మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

కొణిజర్ల, మార్చి25(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మొక్కజొన్న పంటను వెంటనే కొనుగోలు చేయాలని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రం కొణిజర్ల సమీపంలో రోడ్డు పక్కన ఆరబోసిన మొక్కజొన్నలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం, మిర్చి రైతుల పరిస్థితిదారుణంగా ఉందన్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను కూడా రైతులు అమ్ముకోలేక పోతున్నారని తెలిపారు. మక్కా రైతులను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని, ఇంతవరకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతుల పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు ఇబ్బందులు పడకుండ వెంటనే పంటను కొనుగోలు చేశారని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన దళారులకు మంచి అవకాశం వచ్చిందన్నారు. రైతు ప్రభుత్వం అయితే సకాలంలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశా రు. రైతులకు మద్దతు ధర ఇచ్చి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మక్కాలను కొనుగోలు చేయాలని కోరారు. మక్క రైతులు దిక్కుతోచని విధంగా మారారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

'ఆశా'వర్కర్ల నిరసన



ఏన్కూర్‌లో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

వైరా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆశావర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించి అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ మంగళవారం వైరాలోని జాతీయ ప్రధాన రహదారిపై ఆశవర్కర్లు మండుటెండలో నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శాంతినగర్ వరకు మండుటెండలో ర్యాలీ చేసి అనంతరం మానవహారంగా నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు సుంకర సుధాకర్, అనుమోలు రామారావు, ఆశాలు శైలజ, సుజాత, ప్రమీల, రేణుక, ఆదిలక్ష్మీ, హైమావతి, సునీత, దీప, వెంకటరమణ, నాగేంద్ర, విజయ పాల్గొన్నారు.

బోనకల్‌లో..

బోనకల్: హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక పీహెచ్సీ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయు నాయకులు కిలారు సురేష్, బందం శ్రీనివాసరావు, బోయినపల్లి వీరబాబు, గుగులోతు నరేష్, ఏసుపోగు బాబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మధిర రూరల్....

మధిర రూరల్: తమ న్యాయమైన డిమాండ్స్ సాధన కోసం హైదరాబాద్‌లోని మెడిల్ అండ్ హెల్త్ కమిషనరే ట్ ఎదుట నిరసనకు వెళ్తున్న ఆశాకార్యకర్తలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయటాన్ని రైతుసంఘం జిల్లా నాయకుడు పాపినేని రాంనర్సయ్య ఖండిం చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆశాకార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పడకంటి మురళి, తేలప్రోలు రాధాకృష్ణ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు: అక్రమ అరెస్టులకు నిరసనగా ఆశావర్కర్లు మంగళవారం ఏన్కూరులో ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తహసీల్దార్ ఆఫీస్‌మీదుగా ప్రధాన కూడలి వరకు నిర్వహించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు పాల్గొని మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఆశావర్కర్స్ జిల్లా కార్యదర్శి బానోతు అమల, ఇనపనూరి అనురాధ, రజిత, లక్ష్మి, రమణమ్మ, మౌనిక, భవాని, జ్యోతి, అరుణ, నాగమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: ఆశా వర్కర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ తరలి వెళ్లే కార్యక్రమం నిర్వహించిన వర్కర్లపై ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం నిరసిస్తూ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో కమల, కళ్యాణి, ఈశ్వరి, కుమారి, సరస్వతి, దేవి, అచ్చమ్మ, సరోజా, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.



వైరాలో..



మధిర రూరల్....



కారేపల్లిలో...

రంజాన్ తోఫాల పంపిణీ



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న ముస్లిం సంఘ నాయకులు

బోనకల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామ మసీదులో మంగళవారం ముస్లీం ఐక్య సంఘం ఆధ్వర్యంలో 400 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ సందర్భంగా తోఫా(పండుగ సామాగ్రి) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మౌలానా, ముజాహిద్‌లు మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నెల 28న బోనకల్ రైతు వేదిక ఆవరణలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మహబూబ్ పాషా, జాని పాషా, మీరా సాహెబ్, షాజహాన్, చాంద్‌పాషా, రఫీ, బాబు, దస్తగిరి, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై ప్రభుత్వానిది మోసపూరిత చర్య

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిన ప్రకటన చేయడం అత్యంత మోసపూరిత చర్య అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. మంగళవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన రైతుసంఘ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల గత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రూ.రెండులక్షలపైన బ్యాంకుల్లో అప్పు ఉన్న రైతులు ఆపైమొత్తం డబ్బును చెల్లించాలని తర్వాత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుందని ఆయన చేసిన ప్రకటనలను గుర్తుచేశారు. తుమ్మల ప్రకటనలతో ఆయనపై ఉన్న గౌరవం, నమ్మకం, విశ్వాసంతో ఖమ్మంజిల్లాలో అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు బ్యాంకుల్లో రూ.రెండులక్షలకుపైనున్న వ్యవసాయ రుణాలను బ్యాంకుల్లో జమచేశారని రాంబాబు పేర్కొన్నారు. అయితే రూ.రెండులక్షల రుణమాఫీ సంపూర్ణంగా చేయకుండా రుణమాఫీ పూర్తయిందని మంత్రి తుమ్మల అసెంబ్లీలో ప్రకటించటాన్ని మోసపూరిత చర్యగా అభివర్ణించారు. ఎన్నికలకు ముందు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులకు బ్యాంకుల్లో ఎంత అప్పు ఉన్నా రూ.రెండులక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా రూ.రెండు లక్షలకుపైన అప్పు ఉన్న రైతులకు రుణమాఫీ చేయడం ఇది రాష్ట్ర ప్రభుత్వ విధానమని, మంత్రి తుమ్మల అసెంబ్లీ ప్రకటన చేయటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. రైతుసంఘం నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలను అందజేయాలి



యూనిఫాం క్లాత్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈవో

బోనకల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సకాలంలో విద్యార్థులకు యూనిఫాంల స్టిచ్చింగ్‌ను పూర్తి చేసి పాఠశాలలకు అందజేయాలని ఎంఈవో దామాల పుల్లయ్య సూచించారు. స్థానిక ఎంఆర్‌సీలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పాఠశాలలకు సంబంధించి ఎంఆర్‌సీకి వచ్చిన యూనిఫాం క్లాత్‌ను హెచ్‌ఎం, స్టిచ్చింగ్ ఏజెన్సీలకు అందజేశారు. ఐకేపీ ఏపీఎం సురేందర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కారేపల్లి, మార్చి25(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన గ్రామీణ ఉపాధిపనులలో అనేక అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 16వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీఆర్డీవో ఏపీడీ చుంచు శ్రీనివాస్‌రావు ప్రిసైడింగ్ అధికారిగా వ్యహరించారు. గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. మండలంలో 41 గ్రామపంచాయతీలలో 487 పనుల కోసం రూ.7కోట్ల45లక్షలు నిధులు కేటాయించారు. రూ.7,45,39,985కోట్లు ఖర్చు చేయగా, కూలీలకు రూ.7,08, 53,153 సామగ్రికి 36,86,832 చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. పనుల నిర్వహణపై క్షేతస్థాయిలో తనిఖీలు నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశాలలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడంతో కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరులేకుండా పెద్దమొత్తంలో వేతనాలు చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో అనేక తప్పిదాలు వెలుగు చూశాయి. కనీససౌకర్యాలు కల్పించపోవడంతో పాటు ఖర్చులు పెట్టినట్లుగా లెక్కలు చూపించడం వంటి తప్పిదాలపై పలు గ్రామపంచాయతీలలో రికవరీకి అధికారులు అదేశించారు. రూ. లక్షలలోనే అవకతవకలు జరిగిన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీదేవి, డీవిఓ సక్రియ, క్వాలిటీ కంట్రోల్ డీఈ వీరయ్య, ఎంపీవో సురేందర్ ఎంపీఓ రవీందర్‌ప్రసాద్,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బానోత్ కోటేశ్వరరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో ఏపీడీ శ్రీనివాస్‌రావు

మిషన్ భగీరథ ప్రధాన వాల్వ్ లీక్

● కోతకు వచ్చిన వరిపంటకు నష్టం

తల్లాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపేట సమీపంలోని మిషన్ భగీరథ పైపులైన్ ప్రధాన వాల్వ్ లీక్ కావడంతో కోతకు వచ్చిన వరిపంటకు నష్టం వాటిల్లింది. వెంకట్రాముని తండా వద్ద కనకగిరి గుట్టల వద్దనుంచి కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్ ప్రధాన వాల్వ్ మంగళవారం తెల్లవారుజామున లీకైంది. వాల్ లీకేజీతో కోతకు వచ్చిన పదెకరాల్లోని వరి పైరు నీటమునిగింది. దీంతో పంటకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్, మెయిన్ వాల్వ్ వ్యవసాయ పొలాల మధ్యలో వేయడం వల్ల తరచూ లీకేజీలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు. మెయిన్ వాల్వ్ లీకేజీ వల్ల కోతకు వచ్చిన వరిపంట నీటమునిగిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



నీటమునిగిన వరిపంట



లీకైన మిషన్ భగీరథ వాల్వ్